

పైసా విదల్చలేదు!

- ఎక్కడి అభివృద్ధి పనులు అక్కడే..
- భీమవరం పట్టణంలో సమస్యల తిష్ఠ
- మునిసిపల్ నిధులతోనే అరకొరగా పనులు
- పరిష్కారానికి నోచుకోని దీర్ఘకాల సమస్యలు
- హామీలకే పరిమితమైన వైసీపీ ప్రభుత్వం


భీమవరం, ఫిబ్రవరి 18 : ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న సామెత మాదిరిగా భీమవరంలో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల ముసుగులో ప్రచారానికే ఎక్కువ నిధులు వ్యయం చేస్తూ ప్రజావసరాలు తీర్చే అభివృద్ధి పనులకు పైసా విదల్చడం లేదు. అభివృద్ధి పనులన్నీ ఎక్కడికక్కడ నిధులు కొరతను ఎదుర్కొంటున్నాయి. ఇందులో కంపోస్టు యార్డు, మంచినీటి పథకం, యనమదుర్రు కాలుష్యం, జాతీయ రహదారి, కొత్త బైపాస్ వంటివి ఎన్నో ఉన్నాయి. వీటికి సంబంధించి గత ప్రభుత్వ హయాంలో కొన్ని పనులు చేపట్టినా ఇప్పుడు పనులు సాగని పరిస్థితి.

దీర్ఘకాలంగా కంపోస్టు సమస్య

భీమవరం మునిసిపాలిటీ 1948లో ఏర్పడింది. 75 ఏళ్లు పూర్తి చేసుకున్నప్పటికీ కంపోస్టు యార్డుకు స్థలం లేక చెత్త ఎక్కడ వేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. 2006లో 14.5 ఎకరాలు యనమదుర్రు పంచాయతీలో సేకరించారు. కొన్ని కారణాలతో న్యాయపరమైన చిక్కులు ఏర్పడడంతో పెండింగ్‌లో పడింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనాకోడేరు సమీపంలో 36 ఎకరాల డీ పట్టాభూమిని గుర్తించినా గ్రామస్థుల అభ్యంతరాలతో ఆగిపోయింది. రోజుకు 80 మెట్రిక్ టన్నుల చెత్తను యనమదుర్రు గట్టు, ఊరి శివారుల్లో వేయాల్సిన పరిస్థితి.

రోడ్లన్నీ పెండింగ్‌లోనే..

భీమవరం మీదుగా వెళ్లే జాతీయ రహదారికి భీమవరం ఉత్తరం వైపు నుంచి కొత్త బైపాస్ ప్రతిపాదించారు. నందమూరుగరువు నుంచి ఉండి రోడ్డులో నరసింహపురం చెక్‌పోస్టు వరకు 13.5 కిలో మీటర్ల పొడవు బైపాస్ నిర్మిస్తే ట్రాఫిక్ సమస్య తగ్గిపోతుంది. దీనికి సంబంధించి కేంద్రం పామర్రు- పాలకొల్లు వరకు రూ.వెయ్యి కోట్లు కేటాయించి పనులు ప్రారంభించారు. భీమవరం ప్రాంతంలో బైపాస్‌కు సేకరించిన భూమిలో మార్పుల కోసం న్యాయస్థానంలో వాజ్యం వేశారు. ఈ విషయంలో అధికార ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో బైపాస్ పనులకు అవరోధం ఏర్పడింది. 2016లో ఉండి రైలు రోడ్డులో వంతెన నిర్మాణానికి రూ.68 కోట్లు కేటాయించారు. కొన్ని అభ్యంతరాలు కారణంగా ప్రాజెక్టు పెండింగ్‌లో పడింది. గతేదాది రైల్వేశాఖ ఐదు చోట్ల అండర్ పాస్‌లు నిర్మించడంతో అంతర్గత ట్రాఫిక్ సమస్యకు కొంత తగ్గింది. ఇప్పుడున్న మినీ బైపాస్ రైల్వే గేటు వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పట్టణంలో బస్టాండ్ నుంచి ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వరకు రూ.360 కోట్ల అంచనాలతో జేపీ రోడ్డు వరకు ఫ్లయ్‌ఓవర్ ప్రతిపాదించి సీఎం జగన్‌కు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నివేదిక ఇచ్చారు. ఇది కూడా పెండింగ్‌లోనే ఉంది.



యనమదుర్రు డ్రెయిన్

కాలుష్య కాసారం యనమదుర్రు

భీమవరం పట్టణం మధ్య నుంచి ప్రవహిస్తున్న యనమదుర్రు డ్రెయిన్ 50 ఏళ్లుగా పైగా కాలుష్యకాసారంగా ప్రజల అనారోగ్యాలకు కారణహేతువుగా మారింది. ఎగువ నుంచి వచ్చే పరిశ్రమల కాలుష్యానికి దిగువ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 2016లో అప్పటి మంత్రి పితాని సత్యనారాయణ కాలుష్య నివారణకు 21 పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను తణుకు,భీమవరం ప్రాంతాల నుంచి పైపులైన్ ద్వారా తరలించి సముద్రం దగ్గర ఉప్పుటేరు వద్ద ట్రీట్‌మెంట్ ప్లాంట్ కోసం 4.5 ఎకరాలు సేకరించారు. దీని కోసం రూ.100 కోట్ల నిధులను 2019లో కేటాయించారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత కాలుష్యనివారణపై ఊసే లేకుండా పోయింది.



యనమదుర్రు గట్టుపై చెత్త

మునిసిపాలిటీ నిధులే దిక్కు

భీమవరం మునిసిపాలిటీలో పెరిగిన పన్నులతో పాటు వివిధ రూపాల్లో వచ్చే నిధులు రూ.30 కోట్లు దాటింది. ఈ నిధులనే పట్టణాభివృద్ధికి వినియోగిస్తున్నారు. పట్టణం కార్పొరేషన్ స్థాయికి ఎదిగినప్పటికీ, ప్రజల నుంచి వచ్చే నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ నాలుగున్నరేళ్లలో సుమారు రూ.100 కోట్లు పట్టణాభివృద్ధికి మునిసిపాలిటీ నిధులే వాడుకోవాల్సి వచ్చింది. కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే రోడ్డుకు మునిసిపాలిటీకి వచ్చే నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేశారు. యనమదుర్రుపై మూడు వంతెన అప్రోచ్ రోడ్డుకోసం మూడు సార్లు టెండర్లు పిలిచి చివరికి రూ.36 కోట్లతో ఇటీవలే మరోసారి టెండర్లు పిలిచారు. వీటికి కాంట్రాక్టర్లు నుంచి ఏ మేరకు స్పందన వస్తుందో చూడాలి.

అమృత పథకం పూర్తయ్యేది ఎన్నడో ..

భీమవరానికి పదేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం నుంచి అమృత్ పేరుతో మంచినీటి పథకం మంజూరైంది. తొలిదఫా రూ.108 కోట్లు, మలిదఫా కలిపి సుమారు రూ.300 కోట్లు కేటాయించారు. దీంతో పనులు ప్రారంభమై మొదటి దశ పూర్తయింది. ఇందులో భాగంగా 4 చోట్ల సర్వీసు రిజర్వాయర్లను నిర్మించి పంపింగ్ హౌస్‌ను ప్రారంభించారు. అయితే ఈ పనులు ప్రభుత్వ ఇచ్చిన గడువు ఎప్పుడో దాటిపోయింది. కాంట్రాక్టర్లు చాలాపనులు పూర్తి చేయలేకపోయారు. దీనికి కారణం నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టలేకపోయారు.

ట్రీట్‌మెంట్ ప్లాంట్ మరిచారు..

భీమవరంలో నిర్మించి టిడ్కో గృహాల సముదాయానికి మురుగునీరు పరిశుభ్రం చేసేందుకు ప్రతిపాదించి రూ.మూడు కోట్ల నిధులతో చేపట్టిన సీవరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్ నత్తనడకన సాగుతోంది. భవనాలు పూర్తిచేసి యంత్రాల అమరిక పనులు పూర్తిచేసినా ముందుకు సాగడంలేదు. ఇప్పటికే ఇక్కడ కొంతమంది నివాసం ఉంటున్నారు. అయితే మురుగు నీటిని బయటకు పంపే మార్గం లేకుండా పోయింది.



ప్రజల సొమ్ముతో అభివృద్ధి.. ఘన కార్యమా?

ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యేలకు ఎటువంటి నిధులు ఇవ్వలేదు. భీమవరం మునిసిపాలిటీకి ఈ ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వకుండా, ప్రజలు చెల్లించిన పన్నులతో చేపట్టిన అభివృద్ధి పనులను తమ ఘనకార్యంగా చెబుతున్నారు. నా హయాంలో చేపట్టిన కోట్లాది రూపాయలు పనులను సైతం రీ టెండర్లు పిలిచి జాప్యం చేశారు.

- కొటికలపూడి గోవిందరావు (చినబాబు), భీమవరం మునిసిపల్ మాజీ చైర్మన్, జనసేన ఉమ్మడి పశ్చిమ అధ్యక్షుడు



కేంద్ర నిధులతోనే అభివృద్ధి..

రాష్ట్ర ప్రభుత్వ నిధులు మునిసిపాలిటీకి ఒక్క రూపాయి మంజూరు చేయలేదు. ప్రజల చెల్లించిన పనులతోనే ఈ ప్రభుత్వం సోకు చేస్తోంది. 15వ ఆర్థిక సంఘం నిధులు కేంద్రం ఇచ్చింది. దీంతో పాటు సంక్షేమ పథకాలు కేంద్రం ఎన్నో నిధులు ఇస్తుంటే ఇవన్నీ సొంత ప్రభుత్వం ఇచ్చినట్టు ప్రచారం చేసుకుంటున్నారు. వాస్తవాలు ఏంటో ప్రజలకు తెలుసు.

- భూపతి రాజు శ్రీనివాసవర్మ, మాజీ కౌన్సిలర్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి

వంతెన నిర్మించకపోతే...ఓటడగను!

- ఎమ్మెల్యే ముదునూరి శపథానికి

ఐదేళ్లు.. ఇప్పటికీ అతీగతీ లేని వశిష్ఠ వారధి



నరసాపురం, ఫిబ్రవరి 18 : నరసాపురం అభివృద్ధే నా లక్ష్యం.. దీని కోసం మీ అందరి సహకారం తీసుకుని పని చేస్తా, ఈ ప్రాంత ప్రజల చిరుకాల వాంఛ వశిష్ఠా వారధి, ఈసారి దాన్ని నిర్మించి తీరుతా, లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో ప్రజల్ని ఓట్లు అడగను... అంటూ నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు శపథం చేశారు. కౌన్సిల్ సమావేశ సభలో చేసిన ఈ శపథకానికి ఐదేళ్లు నిండుతున్నాయి. వంతెన పనులు మాత్రం చేపట్టలేదు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ముదునూరి శపథం తెర మీదకు వచ్చింది.

ఉభయ గోదావరి జిల్లాల ప్రజల చిరుకాల వాంఛ వశిష్ఠ వారధి. ఇప్పటి వరకు ఇద్దరు ముఖ్యమంత్రులు దీని నిర్మాణానికి శంకుస్థాపన చేసినా అమలుకు నోచుకోలేదు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు 2004లో నరసాపురం- సఖినేటిపల్లి రేవులను కలుపుతూ ఫ్లోటింగ్ వంతెనకు శంకుస్థాపన చేశారు. ఆ ఎన్నికల్లో టీడీపీ ఓటమి చెంది రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. దీంతో ఈ వంతెన పెండింగ్ పడింది. రాష్ట్ర విభజన తర్వాత గత ప్రభుత్వ హయాంలో జాతీయ రహదారి 216 మళ్లిస్తూ వారధి నిర్మించాలని ప్రతిపాదించగా కేంద్రం ఆమోద ముద్ర వేసింది. కానీ ముందడుగు పడలేదు. ఆ తర్వాత ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. కౌన్సిల్ సమావేశానికి ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా విచ్చేసిన ముదునూరి ప్రసాదరాజు తొలి సమావేశంలో నరసాపురం అభివృద్ధిపై సుదీర్ఘ ప్రసంగం చేశారు. ఈసారి సీఎం జగన్‌ను ఒప్పించి వారధి నిర్మించి తీరుతాం, ఒకవేళ సాధ్యం కాకపోతే ప్రజల్ని ఓట్లు అడగనంటూ ఆయన చేసిన శపథం అప్పట్లో నియోజకవర్గంలో హాట్‌టాపిక్ అయింది. గతంలో ఏ నాయకుడు ఈ తరహా శపథం చేయలేదు. సీఎం జగన్‌కు ముదునూరి అత్యంత సన్నిహితుడనని నానుడు ఉంది. ఈ కారణంగా వారధి నిర్మాణం జరిగిపోతుందని అంతా ఆశపడ్డారు. 2022 నవంబరు సీఎం జగన్ నరసాపురం పర్యటనకు విచ్చేసినప్పుడు శంకుస్థాపన చేశారు. భూసేకరణ జరిగింది. దీనికి కేంద్రం రూ.60 కోట్లు కేటాయించింది. అయితే నరసాపురం- సఖినేటిపల్లి రేవుల మధ్య కాకుండా రాజుల్లంక వద్ద దీనిని నిర్మిస్తున్నట్టు ప్రకటించారు. ఇది ప్రజలకు రుచించలేదు. అయినా ఏదో ఒక వంతెన వస్తుందని సరిపెట్టుకున్నారు. ఈ క్రమంలో కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలానికి చెందిన కొంత మంది రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో టెండర్లు తెరవని పరిస్థితి ఏర్పడింది. ఈ కారణంగా వంతెన పనులు ముందుకు సాగలేదు. ముదునూరి శపథమూ నెరవేరలేదు.. ప్రజల కష్టాలూ తీరలేదు.



పైడిచింతపాడులో అక్రమ చెరువు తవ్వకాలను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో హిమశైలజ

అక్రమ చేపల చెరువులు తవ్వకుండా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

- డీఎఫ్‌వో హిమశైలజ

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 18 : కొల్లేరు అభయారణ్యం ఐదో కాంటూరు పరిధిలో ఎక్కడా అక్రమ చేపల చెరువులు తవ్వకుండా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్టు వన్యప్రాణాల విభాగం డివిజనల్ అటవీశాఖ అధికారిణి ఎం.హిమశైలజ తెలిపారు. ఏలూరు రూరల్ మండలం పైడిచింతపాడు, మల్లవరం, బొబ్బిలిలంకలో ఆదివారం ఆమె పర్యటించి అక్రమ చేపల చెరువులను పరిశీలించారు. అభయారణ్యం పరిరక్షణకు రాజమండ్రి ముఖ్య అటవీసంరక్షణ అధికారి ఆదేశాల మేరకు డివిజనల్ అటవీశాఖ అధికారి వన్యప్రాణుల విభాగంశాఖ అధ్యక్షతన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ నియమించినట్టు తెలిపారు. రాజమండ్రి సర్కిల్ పరిధిలోని అటవీశాఖ అధికారులను, సిబ్బందిని ఏలూరు వన్యప్రాణి విభాగం కార్యాలయంలో సమావేశ పరిచి అభయారణ్యం పరిరక్షణకు సూచనలు ఇచ్చామన్నారు. 52 మంది అటవీశాఖ అధికారులు, సిబ్బందితో కలిసి అభయారణ్యంలో ప్రభుత్వ భూముల్లో చెరువులు తవ్వకాలు జరగకుండా తనిఖీలు చేశామన్నారు. కొల్లేరు ఐదో కాంటూరు పరిధిలో ఎటువంటి అక్రమ చేపల చెరువులు తవ్వకాలు జరపరాదని, తవ్వకాలు జరిపితే వారిపై వన్యప్రాణుల చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. టాస్క్‌ఫోర్స్ టీమ్ కొల్లేరు అభయారణ్యంలో నిరంతరం గస్తీ తిరుగుతూ అక్రమ చేపల చెరువులు తవ్వకాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటుందని ఆమె స్పష్టం చేశారు.



ఆలయ ప్రాంగణంలోని మండపంలో జరుగుతున్న శుభకార్యం

చిన వెంకన్న సన్నిధిలో పెళ్లి సందడి

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 18: ఉపనయనాలు, వివాహాలు చేసుకునేందుకు మంచి ముహూర్తం కావడంతో ఆదివారం శ్రీవారి క్షేత్రం ఇందుకు వేదికైంది. సాధారణంగా ఉపయనాలకు మంచిముహూర్తం కుదరదు. అయితే ఈ ఈ మాసంలో ఇది మంచిది కావడంతో, ఉపనయనాలు, వివాహాలు అనివేటి మండప ప్రాంతంలో, ప్రైవేటు కల్యాణ మండపాల్లో శాస్త్రోక్తంగా జరిగాయి. అగ్నిక్రియలను జరిపించి శుభముహూర్త సమయంలో వటువులకు యజ్ఞోపవీత ధారణ జరిపారు. స్థానిక పాత కల్యాణ మండప ప్రాంతంలో, ప్రైవేటు ఫంక్షన్ హాళ్లలోను వివాహాలు అధికంగా జరిగాయి.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 49 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 18 : ఏలూరు జిల్లాలో ఆదివారం జరిగిన ఇంటర్మీడియట్ ఒకేషనల్, జనరల్ విభాగాల ప్రాక్టికల్స్ పరీక్షలకు మొత్తం 2,175 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 2,126 మంది హాజరయ్యారని డీవీఈవో ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయన్నారు.



పట్టుబడి చేసిన తెల్ల చేపలు



చేప విలవిల!

- చేపల కొనుగోలుకు ముందుకు రాని వ్యాపారులు
- కిలో శీలావతి రూ.100.. గిట్టుబాటు కాని ధర
- అయోమయంలో చేపల రైతులు

కలిదిండి, ఫిబ్రవరి 18 : చేపలను వ్యాపారస్థులు కొనుగోలు చేయక పోవడంతో చేపల పెంపకం రైతులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. కిలోన్నర ఉన్న శీలావతి చేపలను కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రాకపోవడంతో వాటిని పెంచడానికి మేత ఖర్చులు అధికమవ్వటంతో పెట్టుబడి వ్యయం పెరిగిపోతోందని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కిలో శీలావతి చేపలను రూ.100 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. దీంతో గిట్టుబాటు ధర లభించక రైతులు నష్టపోతున్నారు. కిలో చేప ధర రూ.120 ఉంటేనే గిట్టుబాటు అవుతుందని రైతులు అంటున్నారు. చేపల ధర పడిపోయినప్పటికీ డీవోబీ తవుడు ధర ఆకాశన్నంటుతోంది. పది టన్నుల డీవోబీ తవుడు ధర రూ.1.80 లక్షలు ఉంది. ప్రస్తుతం చేపల ధరను బట్టి పది టన్నుల డీవోబీ తవుడు ధర రూ.లక్షా ఇరవై వేలు ఉండాల్సి ఉండగా, పైపైకి ఎగబాకుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరం లీజు లక్ష రూపాయలు పలుకుతోంది. ప్రస్తుతం చెరువుల్లో చేపల పట్టుబడి దశలో ఉన్నాయి. అమ్ముదామంటే కొనుగోలు చేసే నాథుడే లేడు. చెరువులో పెంపకం చేయడానికి లక్షలాది రూపాయల అదనపు పెట్టుబడి అవుతోందని వాపోతున్నారు. అసోం, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లో చేపల కొనుగోళ్లు మందకొడిగా ఉండడం వల్లే చేపల ఎగుమతులు నిలిచిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో చేపల మార్కెట్ ఎప్పుడు పుంజుకుంటుందో తెలియని పరిస్థితి నెలకొందంటున్నారు. చేపల ఎగుమతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



తెల్ల చేపలను వ్యాపారస్థులు కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం కిలోన్నర ఉన్న శీలావతి చేపలను కొనుగోలు చేయడం లేదు. కిలో సైజు చేపలకు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. గిట్టుబాటు ధర లభించక నష్టాల బారినపడుతున్నాం. ఈశాన్య రాష్ట్రాలకు చేపలు ఎగుమతి అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- మంతెన సుబ్బరాజు, ఆక్వా రైతు



ఉత్తుత్తి.. ఆసరా!

- బటన్ నొక్కడంతో సరిపెట్టిన ప్రభుత్వం
- మహిళల ఖాతాల్లో జమకాని నిధులు
- మహిళా సంఘాల ఎదురుచూపులు



ఏలూరు రూరల్, ఫిబ్రవరి 18 : 'బటన్ నొక్కుతున్నా.. లంచాలు, వివక్షకు తావులేకుండా అర్హులకు సంక్షేమ నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకే వేస్తున్నా'.. అని ప్రతివేదికపై నుంచి సీఎం జగన్ ప్రకటిస్తుంటారు. అయితే ఆయన బటన్‌లు నొక్కడం వరకే పరిమితం అవుతు న్నారు. బటన్‌లు నొక్కినా లబ్ధిదారులకు ఆయా పథకాల నగదు జమ కావ డం లేదు. ఈ కోవలోనే ఆసరా పథకం చేరింది. నాలుగో విడత ఆసరా పథ కం బటన్‌నొక్కి దాదాపు మూడు వారాలవుతున్నా ఇప్పటివరకు లబ్ధిదారుల ఖాతాలో డ్వాక్రా రుణమాఫీ డబ్బులు జమ కాలేదు. కొద్దిరోజుల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే నేపథ్యంలో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. అమ్మఒడి, చేయూత, పించన్ పథకాల మాదిరిగా ఆంక్షల పేరుతో లబ్ధి దారుల్లో కోత పెట్టేందుకు వీలు లేకపోవడంతో వాయిదాల పద్ధతిలో పథ కాన్ని నీరుగార్చేందుకు పూనుకుంది.

ఇటీవల అనంతపురం జిల్లా ఉరవకొండలో వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగో విడత స్వయం సహాయక పొదుపు సంఘాలకు సీఎం బటన్‌నొక్కి వారి ఖాతాల్లో నగదు జమ చేశారు. ఏలూరు జిల్లాలో 39,574 స్వయం సహాయక పొదుపు సంఘాల్లోని 3,89,801 మంది మహిళలకు రూ.362.59 కోట్లు విడుదల చేసింది. నాలుగో విడత పంపిణీ, ఎన్నికల ప్రచారానికి ఉపయోగపడేలా వైసీపీ ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసి నియోజకవర్గాల వారీగా కార్యక్రమాలు చేపట్టి దాని ఆధారంగానే సమావేశాలు పూర్తి చేశారు కాని నేటికీ మహిళా సంఘాల అకౌంట్లకు నిధులు జమ కాలేదని మహిళలు ఆందోళన చెందుతున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి జనవరి 23న సీఎం బటన్ నొక్కారు. తర్వాత జనవరి 31 వరకు ప్రతి మండలంలో ఎమ్మెల్యేలతో సమా వేశాలు ఏర్పాటు చేశారు. వాటికి సంబంధించి క్లిప్పింగ్‌లు, వీడియోలు సీఎం కార్యాలయానికి పంపించారు. మహిళా సంఘాలకు వారి అకౌంట్లో ఫిబ్రవరి 1న ఆసరా సొమ్ము జమ చేయాల్సి ఉంది. కాని ఇప్పటికి నగదు జమ కాలేదు. చింతలపూడి నియోజకవర్గంలో 6,688 మహిళా సంఘాల్లోని 65,922 మంది మహిళలకు రూ.74.91 కోట్లు, దెందులూరులో 5,438 సంఘాల్లోని 53,104 మంది మహిళ లకు రూ.53.70, ఏలూరు 3,619 మహిళా సంఘాల్లోని 33,002 మంది మహిళలకు రూ.27.80 కోట్లు, గోపాలపురం 1,524 సంఘాల్లోని 15,251 మంది మహిళలకు రూ.16.09 కోట్లు, కైకలూరు 5,181 సంఘాల్లోని 52,953 మందికి రూ.46.73 కోట్లు, నూజివీడు .5,771 సంఘాల్లోని 59,584 మంది మహిళలకు రూ.53.56 కోట్లు, పోలవరంలో 6,200 మహిళా సంఘాల్లోని 59,170 మంది మహిళలకు రూ.44.18 కోట్లు, ఉంగుటూరు నియోజకవర్గంలో 51.56 సంఘాల్లోని 50,815 మంది మహిళలకు రూ.45.86 కోట్లు జమ చేయాల్సి ఉంది. అయితే ఎప్పుడు జమ చేస్తారో ప్రభుత్వానికే తెలియాలని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


సచివాలయమా.. పార్టీ కార్యాలయమా..!

- లక్ష్మీపురం సచివాలయంపై వైసీపీ జెండా



పెదవేగి, ఫిబ్రవరి 18 : సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలపై జాతీయ పతాకం రెపరెపలాడుతూ ఎగురుతుంది. కానీ పెదవేగి మండలం లక్ష్మీపురంలోని గ్రామ సచివాలయ భవనంపై వైసీపీ పతాకం ఎగురుతోంది. నెలరోజుల కిందట గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రారంభించారు. ఈ భవనంపై ఇటీవల జాతీయ జండాకు బదులుగా వైసీపీ జండాను ఏర్పాటు చేశారు. కొద్దిరోజులుగా భవనంపై పార్టీ జెండా ఎగురుతున్నా పట్టించుకునేవారే లేరు. ప్రభుత్వ భవనంపై వైసీపీ జెండాను ఏర్పాటు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అంతర్వేది ఏర్పాట్లు పరిశీలించిన ఏఎస్పీ



నరసాపురం, ఫిబ్రవరి 18 : అంతర్వేది తరలివెళ్లే భక్తులకు నరసాపురం రేవులో ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టాలని ఏఎస్పీ భీమారావు ఆదేశించారు. ఆదివారం రాత్రి మాధవాయిపాలెం రేవును ఆయన సందర్శించారు. పంటు, పడవల్లో నిర్దేశించిన సంఖ్యలోనే ప్రయాణికులను ఎక్కించాలన్నారు. తిరునాళ్ల ముగిసే వరకు రేవుల్లో 24 గంటలు పోలీసు బందోబస్తు ఉండాలన్నారు. రాత్రి వెళ్లల్లో రాకపోకల్ని అనుమతించొద్దన్నారు. గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్ల అందుబాటులో ఉండాలన్నారు. అయన వెంట సిఐలు స్వామీ, సతీష్, ఎస్ఐలు ప్రసాద్‌లు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి

- నిజం చెప్పేవారిపై విచక్షణారహితంగా దాడులు
- ఖండించిన పలువురు నాయకులు

జగన్‌కు ఓటమి భయం పట్టుకుంది : చింతమనేని



మాజీ ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, ఫిబ్రవరి 18 : సైకో జగన్‌ను ఓటమి భయం వెంటాడుతోందని, ఎక్కడికక్కడ దాడులు చేయిస్తున్నాడని దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌రెడ్డి ఆదివారం అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ మూకలు దాడిచేసి, విచక్షణారహితంగా గాయపర్చిన ఘటనపై ఆయన స్పందించారు. సమాజంలో నాలుగో స్తంభమైన మీడియాపై దాడులకు తెగబడిన నైజం జగన్ శాడిజాన్ని రుజువుచేస్తోందని, ఇటువంటి దాడులను ప్రోత్సహిస్తున్న జగన్ నిజస్వరూపాన్ని ప్రజలు గుర్తుంచుకుని, వచ్చే ఎన్నికల్లో జగన్‌ను చిత్తుగా ఓడించి తగిన బుద్ధి చెప్పాలన్నారు. మొన్న దెందులూరులో జరిగిన సభలో మీడియా ప్రతినిధులపై దాడికి తెగబడిన ఘటన మరువకముందే ఆదివారం అనంతపురం జిల్లా రాప్తాడులో ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడికి తెగబడిన వైనం వైసీపీ అరాచక పాలనకు పరాకాష్టగా అభివర్ణించారు. ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడికి పాల్పడి, గాయపర్చిన వైసీపీ గూండాలపై హత్యకేసు నమోదుచేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కృష్ణకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు జరిగిన పరిణామంలో అతడి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దాడులతో భయపెట్టలేరు..

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 18 : దాడులతో భయపెట్టి దారికి తెచ్చుకోవాలనుకోవడం సరికాదని, అనంతపురం ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడం అత్యంత దుర్మార్గచర్య అని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) సభ్యుడు జీవీఎస్ఎన్ రాజు తీవ్రంగా ఖండించారు. ప్రజా వ్యతిరేకతతో ఇప్పటికే సహనం కోల్పోయిన సీఎం జగన్ పాల్గొన్న సభలో వృత్తి ధర్మం నెరవేరుస్తున్న ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ కార్యకర్తలు విచక్షణ లేకుండా రెచ్చిపోయి మూకుమ్మడిగా దాడి చేయడమే కాకుండా గాయపర్చడం అత్యంత హేయమన్నారు. పాత్రికేయులు, ఫొటోగ్రాఫర్‌లు ఎవరు తమ ఇష్టానికి విరుద్ధంగా.. ఆఖరికి వృత్తిరీత్యా వ్యవహరించనా తట్టుకోలేకపోతున్నారన్నారు. అరాచక మూకలు చెలరేగిపోతుంటే.. నిలువరించాల్సిన నేతలు.. మరింతగా కార్యకర్తలను రెచ్చగొట్టే దాడులకు ఉసిగొల్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్రిక స్వేచ్ఛను పూర్తిగా దెబ్బతీసేందుకు అనంతపురం వంటి సంఘటనలకు పాల్పడిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని, సీఎం జగన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

● ఏపీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి దాసు, కార్యవర్గసభ్యులు సూరిబాబు, కృష్ణారావు తదితరులు దాడిని తీవ్రంగా ఖండించారు.

రేపటి నుంచి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు

- 22న ఉదయం కల్యాణం, 24న శ్రీచందనోత్సవం



లక్ష్మీనరసింహస్వామి

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 18: సుందర గిరిపై కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 20నుంచి 25వరకు కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ఈవో వేండ్ర త్రినాధరావు తెలిపారు. శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురంలో కొలువైన స్వామివారి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20న ఉదయం స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేస్తారు. సాయంత్రం ధ్వజావరోహణ జరుగుతుందన్నారు. 21న నిత్యహోమాలు, మూలమంత్రహవనాలు, 22న ఉదయం కల్యాణమహోత్సవం, 23న నిత్యహోమాలు, గ్రామోత్సవం, 24న పంచామృతాభిషేకాలు, శ్రీచందనోత్సవం, ధ్వజ అవరోహణ, 25న సాయంత్రం ద్వాదశప్రదక్షిణలు, శ్రీపుష్పయాగంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని తెలిపారు.

కవిటంలో ఘనంగా అతిరుద్ర మహాయాగం

- కన్నుల పండువగా దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణం



దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

పోడూరు, ఫిబ్రవరి 18 : కవిటంలో అతిరుద్ర మహాయాగం మహోత్సవాలు ఎనిమిదో రోజు ఆదివారం ఘనంగా జరిగాయి. వేదపండితులు రుద్రహోమం పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. నెలమూరుకు చెందిన ఉమారామలింగేశ్వర ట్రస్ట్, శర్వాణి స్కూల్ ఆధ్వర్యంలో దాతలు, భక్తులు, గ్రామస్థుల సహకారంతో ఆధ్యాత్మికవేత్త జంధ్యాల శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో యాగ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. . 56మంది రుత్వికులచే 1,232 సార్లు రుద్ర పారాయణలు ఈశ్వరునికి అభిషేకం నిర్వహించారు. 25మంది రుత్వికులచే 84సార్లు చండీ నిర్వహించారు. రుద్రహోమం, రుద్ర క్రమార్చన త్రిశతీ అర్చన చండీ హోమం, వేద స్వాహకారం అరుణ హోమం నిర్వహించారు. సామూహిక లలితా సహస్రనామ పారాయణ చేశారు. పండితులు మంత్రోచ్చరణలతో వాయిద్య మేళతాళాలతో భక్త జనసందోహం మధ్య కన్నుల పండువగా విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహించారు.

కన్నుల పండువగా శోభనాచలేశుడి కల్యాణం



ఆగిరిపల్లి, ఫిబ్రవరి 18: మాఘ రథసప్తమి తిరునాళ్ళలో భాగంగా ఆదివారం శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. కైంకర్యపరులుగా నాగి రెడ్డి అప్పారావు పాల్గొన్నా రు. సాయంత్రం చిన శేషవాహనంపై స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. అనం తరం జరిగిన నిత్య కల్యాణంలో కైంకర్య పరులుగా ఆగిరిపల్లి ఆర్యవైశ్య సంఘం నుంచి 10 జంటలు పాల్గొన్నా యి. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

రజకులను చైతన్యపరిచేందుకే 26న మహాసభ



సమావేశంలో మాట్లాడుతున్న కట్లయ్య

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 18: రాష్ట్ర వ్యాప్తంగా రజకులను సమాయత్త పరిచి చైతన్యం చేసేందుకు ఏలూరులో ఈనెల 26న ఉమ్మడి జిల్లాల రజక జన మహాసభ నిర్వహిస్తున్నామని రజక జనసంఘ జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య తెలిపరు. మహాసభ నిర్వహణకు సంబంధించి ఆదివారం ఏలూరులోని జిల్లా రజక జనసంఘ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్ళు గడిచినా రజకుల సామాజిక స్థితి మారలేదన్నారు. రజకులని కించపరుస్తూ మాట్లాడే వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రజకుల ఆర్థికాభివృద్ధికి చట్టాలు చేసినప్పటికి, ప్రభుత్వ జీవోలు విడుదల చేసినప్పటికి అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రజక సామాజిక వర్గ గొంతు శాసనసభలో వినిపించాలంటే తప్పనిసరిగా రాజకీయ పార్టీలు రజకులకు అసెంబ్లీ స్థానాల్లో ప్రాధాన్యతనివ్వాలని కోరారు. రజక జనసభలో రజకుల ఇబ్బందులపై పరిష్కార దిశగా తీర్మానాలు చేసి ప్రభుత్వం ముందు ఉంచుతామన్నారు. ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాలలోని రజకులను మహాసభకు వచ్చేలా సమాయత్తపరుస్తున్నామన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

చిల్డ్రన్స్ పార్కులో చిన్నారుల సందడి

- శేషాచలంపై పిల్లలకు ఆటవిడుపు
- కొత్త ఆట వస్తువులతో మరింత కళ





జారుడు బల్లపైనుంచి జారుతూ.. మినీ రంగులరాట్నంపై చిన్నారులు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 18: చిన్నతిరుమలేశుని క్షేత్రానికి తమ చిన్నారులతో వచ్చే యాత్రికులు అటు ఆధ్యాత్మికంతో పాటు ఇటు ఆహ్లాదాన్ని పొందుతున్నారు. శేషాచలంపై నూతన అన్నదాన భవనం వద్ద నిర్మించిన చిల్డ్రన్స్ పార్క్ వారిని అలరిస్తోంది. ప్రస్తుతం ఈ పార్కు ఇటీవల వచ్చిన కొత్త ఆటవస్తువులతో కళకళలాడుతోంది. ఆదివారం క్షేత్రానికి తమ పెద్దలతో వచ్చిన పిల్లలు ఆటవిడుపుగా ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. సరదాగా సందడి చేశారు. రోలర్, గ్లోబు, బాతుబొమ్మల రంగులరాట్నం. వాల్‌క్లైమింగ్, ఉయ్యాల, జారుడుబల్ల, ఊగుడుబల్ల, స్ప్రింగ్ బాతు బొమ్మ, వంటి పలురకాల ఆటవస్తువులతో వారు సందడి చేశారు. గతంలో గుంటూరుకు చెందిన అక్కాచెల్లెళ్లు వెలగలేటి సత్యవతి, దుర్గాదేవి రూ. 2 లక్షలతో కొనుగోలు ఆటవస్తువులను పార్కులో ఉంచారు. అవి పాతవై కొన్ని మరమ్మతులకు గురికావడంతో కొందరు దాతల సహకారంతో మరిన్ని రకాల ఆటవస్తువులతో పార్కు కళకళలాడుతోంది. పిల్లలను ఆడిస్తూ అందులో వారు పొందుతున్న ఆనందాన్ని చూసి వారి తల్లిదండ్రులు ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. వీటితో క్షేత్రానికివచ్చిన భక్తుల పిల్లలే కాకుండా గ్రామంలోని చిన్నారులు సైతం సరదాగా ఆడుకుంటున్నారు.







చిన్నారుల ఆటలు



బాతుబొమ్మల రంగులరాట్నంపై తిరుగుతూ..

సీపీఎస్ రద్దు హామీ అమలేది ?

- సీఎం జగన్ హామీపై ఎస్టీయూ ధ్వజం



ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న జల్లి విల్సన్

పాలకోడేరు, ఫిబ్రవరి 18 : వైసీపీ ఎన్నికల మేనిఫెస్టోలో బైబిల్, ఖురాన్, భగవద్గీతగా భావించి మేనిఫెస్టోలో పెట్టిన అన్నీ అమలు చేస్తానని చెప్పిన సీఎం జగన్ సీపీఎస్‌ను ఎందుకు రద్దు చేయలేదని, మెగా డీఎస్సీ ఎందుకు తీయలేకపోయారని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) నాయకులు ధ్వజమెత్తారు. భీమవరంలోని గొల్లలకోడేరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పెన్మెత్స రామకృష్ణంరాజు ఆడిటోరియంలో ఎస్టీయూ 77వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఆదివారం కొనసాగాయి. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించడానికి చర్యలు తీసుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో విద్యారంగం కుప్పకూలిపోయిందని ముఖ్యంగా జీవో 117తో విద్యా వ్యవస్థ సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. పాఠశాలల విలీనంతో చాలామంది విద్యార్థులు విద్యకు దూరమయ్యారని ఉపాధ్యాయులపై పనిభారం 40శాతం పెరిగిందన్నారు. 25 వేల ఉపాధ్యాయుల ఖాళీలుంటే ఆరువేల పోస్టులతో డీఎస్సీ ఇవ్వడం సిగ్గుచేటని పైగా అప్రంటీస్ విధానాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. తెలంగాణ ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి సదానంద గౌడ్, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, పశ్చిమ గోదావరి జిల్లా డీఈవో ఆర్‌వీ రమణ, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గాజుల నాగేశ్వరరావు, కేవీ రామచంద్రరావు, ఆర్థిక కార్యదర్శి ప్రసాద్, గంట మోహన్, ఎంవీఎస్ఎన్ ప్రసాద్, వైసుబ్రహ్మణ్యంరాజు, నారాయణ, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ, జగన్‌ను గద్దె దింపాలి : విల్సన్

ప్రధాని మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశంలో రాజ్యాంగం కనిపించదని, వ్యవస్థలన్నీ కుప్పకూలిపోతాయని, మోదీని ఇంటికి పంపించే సమయం ఆసన్నమైందని మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జల్లి విల్సన్ అన్నారు. ఆదివారం ఎస్టీయూ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ మోదీ మేకవన్నె పులి అని విమర్శించారు. రాష్ట్రంలో జగన్ ఐదేళ్లలో చేసింది శూన్యమని, జగన్ సర్కారు అవలంబిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు.



భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీవారి ఆలయ ప్రాంగణం

శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 18: చిన్నతిరుమలేశుని ఆలయం ఆదివారం భక్తజనులతో పోటెత్తింది. దాదాపు 25వేల మంది పైబడి యాత్రికులు శ్రీవారు, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి. మాఘ మాసం, అందులోనూ శుభకార్యాలకు ముహూర్తాలు ఉండడంతో అటు భక్తులతో పాటు పెళ్లి, ఒడుగు జనాలు ఉండడంతో క్షేత్రపరిసరాలు సందడిగా మారాయి. వారంతా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం వకుళమాత అన్నప్రసాద భవనంలో ప్రసాదాన్ని స్వీకరించారు.

ముగిసిన శ్యామలా నవరాత్రులు

కైకలూరు, ఫిబ్రవరి 18: శ్యామలా నవరాత్రుల సందర్భంగా చివరి రోజు శ్రీశ్యామలాంబ రాజశ్యామలగా దర్శనమిచ్చారు. ఆదివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి హోమాలు నిర్వహించగా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పాల్గొన్నారు. 9 రోజుల పాటు అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమివ్వగా ఉభయదాతలు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆలయంలోని రామలింగేశ్వర, రామేశ్వరస్వామివార్ల కల్యాణ పీఠాలను సుందరంగా తీర్చి దిద్ది లఘు సంప్రోక్షణ గావించారు. ఆలయ చైర్మన్లు గుర్రం రాంబాబు, బూరుబోయిన మోహనరావు పూజలు నిర్వహించారు. ఎంపీపీ అడవి కృష్ణ, వేంకటేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్ బొప్పన శివకుమార్, ధర్మకర్తలు వసుంధర మురళీ తదితరులు పాల్గొన్నారు. ఈవో వీఎన్‌కె శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు.

నేడు లక్ష్మీనరసింహ స్వామి తిరు కల్యాణం

ముసునూరు, ఫిబ్రవరి 18: ముసునూరులోని లక్ష్మీనరసింహస్వామి తిరు కల్యాణాన్ని సోమవారం రాత్రి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. రాత్రి 7 గంటలకు ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన జరుగుతుందని భక్తులు వేలాదిగా పాల్గొని స్వామివారి కల్యాణం తిలకించి, అన్నప్రసాదాన్ని స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

హనుమాన్ సినిమా గుర్తుండిపోయేలా చేసింది : గెటప్ శ్రీను



సినీ నటుడు గెటప్ శ్రీను

ఆకివీడురూరల్ ఫిబ్రవరి 18 :సంక్రాంతి పండుగకు విడుదలైన హనుమాన్ సినిమా తన జీవితంలో గుర్తుండి పోయేలా చేసిందని సినీ నటుడు గెటప్ శ్రీను అన్నారు. స్వగ్రామమైన కళింగగూడెంలో గ్రామదేవతల జాతర సమయంలో విచ్చేసి అమ్మవార్లను దర్శించుకోవడం ఇష్టమని ఆదివారం విలేకరులకు తెలిపారు. 2023లో 'పొలిమేర' విజయంతో ముగిసిందని, 2024 సంక్రాంతి పండుగకు విడుదలైన హనుమాన్ సూపర్ హిట్‌గా నిలిచి మంచి గుర్తింపు తెచ్చిందని దీనికి కారణమైన డైరెక్టర్ ప్రశాంత వర్మకు రుణపడి ఉంటానన్నారు. ప్రశాంత వర్మ తనకు జాంబిరెడ్డిలో మంచి కామెడీ పాత్రను ఇచ్చారని, హనుమాన్‌లో ఎక్కువ నిడివి గల ప్రాతను ఇచ్చి ప్రోత్సహించారన్నారు. ఈ సినిమాకు మెగాస్టార్ చిరంజీవి నుంచి వచ్చిన అభినందన మరిచిపోలేనన్నారు. తాను హీరోగా నటించిన సినిమా 'రాజుయాదవ్' ఎప్రిల్‌లో విడుదలవుతుందని, జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర, పోతినేని రామ్ హీరోగా నటించిన డబుల్‌ఇస్మార్ట్, కూర్మనాయకి సినిమాలలో నటించానన్నారు.

క్రైం సమాచారం

రైలు కిందపడి ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

నరసాపురం, ఫిబ్రవరి 18: నరసాపురం రైల్వేస్టేషన్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో రైలు పట్టాలపై ఇంజనీరింగ్ విద్యార్థి జి.కిరణ్‌సాయికుమార్(20) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే జీఆర్పీ ఎస్ఐ రమణ తెలిపిన వివరాలివి.. రుస్తుంబాద ప్రాంతం మెరకగూడెంకు చెందిన కిరణ్‌సాయికుమార్ మండలంలోని స్వర్ణాంధ్ర కాలేజీలో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం రాత్రి ధర్మవరం ఎక్స్‌ప్రెస్ కింద పడి బలవన్మరణానికి పాల్పడాడు. ఈ రైలు వెనుక వెళ్లిన లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు గుర్తించి స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు దాన్ని నరసాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలి అనుమానాస్పద మృతి

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 18: తాడేపల్లిగూడెం హౌసింగ్ బోర్డు ప్రాంతంలో వృద్ధురాలు ఇంట్లోనే మృతి చెంది దుర్వాసన వస్తుండడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో ఆదివారం విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. తాడేపల్లిగూడెంకు చెందిన ఎస్.జ్యోతి(68) వృద్ధురాలు కొన్నేళ్ల క్రితం భర్త మరణించడంతో ఒంటరిగానే ప్రభుత్వం అందించే పింఛన్‌తో జీవనం సాగిస్తుంది. ఆమెకు పిల్లలు లేరు. రెండు రోజులుగా ఇంట్లోంచి దుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానికులు గమనించి ఆమె విగతజీవిగా ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ సుబ్రహ్మణ్యం ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఆటో బోల్తా... నలుగురికి గాయాలు

పోడూరు, ఫిబ్రవరి 18 : ఆలమూరు నుంచి లంకలకోడేరు వెళ్లే రహదారిలో జడ్పీ హైస్కూల్ సమీపంలోని మలుపు వద్ద ఆదివారం ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలివి.. వీరవాసరం మండలం రాయకుదురుకు చెందిన ఎనిమిది మంది గౌరీపట్నం మేరీమాత దర్శనం చేసుకుని తిరిగి వస్తున్నారు. సాయంత్రం సమయంలో కొమ్ముచిక్కాల రోడ్డు మలుపు వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి రోడ్డుపై ఆటో బోల్తా పడింది. రోడ్డు పక్కన ఉన్న బోదెలో ఇద్దరు పడిపోయారు. స్థానికులు బోదెలో పడిన ఇద్దరినీ, ఆటోలో ఉన్న వారిని బయటకు తీసి 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. వీరిలో సునీత, భవాని, మణిబాబు, రమేష్‌కు గాయాలు కాగా పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వేర్వేరు చోట్ల 11మంది జూదరుల అరెస్ట్

ఏలూరు క్రైం/ఆకివీడు/కాళ్ల, ఫిబ్రవరి 18 : ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో పేకాట ఆడుతున్నట్టు రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డికి సమాచారం అందింది. తన సిబ్బందిలో ఆదివారం సాయంత్రం దాడి చేసి పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.12 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేశామన్నారు. ఆకివీడు మండలం ఆకివీడు దొరగారి చెరువుగట్టుపై ఆదివారం పేకాటాడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2,900 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు. కాళ్ళ మండలం కాళ్ళకూరులో పేకాటాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామని కాళ్ళ పోలీసులు ఆదివారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7,900 నగదు స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేశామని కాళ్ళ ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.

ఆలయంలో చోరీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 18 : ఏలూరు సత్రంపాడు నెహ్రూ కాలనీ ఒకటో రోడ్డులో ఉన్న శ్రీదుర్గానాగమల్లేశ్వర స్వామి ఆలయంలో చోరీ జరిగినట్టు ఆలయ ప్రతినిధి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏలూరు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. ఈనెల 15వ తేదీ అర్ధరాత్రి గుడిలోని రెండు ధర్మడిబ్బీలు గుర్తుతెలియని దొంగలు అపహరించుకుపోయారని గుడికి సంబంధించిన ప్రతినిధి మాగంటి శివన్నారాయణ ఆదివారం ఫిర్యాదు చేశారు. త్రీటౌన్ సీఐ వి. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ వలకు చిక్కిన వైద్యుడు

- రూ.2 లక్షలు పోగొట్టుకున్న వైనం
- కేసు నమోదు చేసిన ముదినేపల్లి పోలీసులు

ముదినేపల్లి, ఫిబ్రవరి 18 :ఆన్‌లైన్ లింకుల జోలికి వెళ్లి సొమ్ము పోగొట్టుకోవద్దని పోలీసు అధికారులు చెబుతున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో కొందరు సైబర్ మోసాల్లో ఇరుక్కుంటున్న ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. ముదినేపల్లిలో తాజాగా మరో సైబర్ క్రైం బయటపడింది. ముదినేపల్లి పోలీసులు తెలిపిన వివరాలివి.. ముదినేపల్లిలోని గురజ రోడ్డులో నేత్ర వైద్యశాల నిర్వహిస్తున్న వైద్యుడు ఎం.శివరామకృష్ణ ఆన్‌లైన్‌లో వచ్చిన ఒక లింకును చూసి గత రెండు నెలలుగా సొమ్మును పెట్టుబడి పెట్టడం ప్రారంభించారు. ఈ ఏడాది జనవరిలో ఆ లింకును ఓపెన్ చేసి రూ.80 వేలు పంపారు. అందుకు ప్రతిఫలంగా ఆయన అకౌంట్‌లో లింకుదారుడు రూ.3 వేలు జమ చేశాడు. అనంతరం జనవరి 7 నుంచి 15 వరకు మరి కొంతసొమ్ము ఆన్‌లైన్ లింకులో పెట్టుబడి పెట్టారు. సొమ్ము అంతా కలపి రూ. 2.03 లక్షలకు చేరింది. అప్పటి నుంచి తిరిగి లింకు ఓపెన్ కావడం లేదు. కొంతకాలం వేచి చూసినా ఫలితం లేకపోవడంతో బాధితుడు సైబర్ క్రైం విభాగానికి ఫిర్యాదు చేశారు. సైబర్ క్రైం అధికారుల నుంచి అందిన సమాచారం మేరకు ఆదివారం ముదినేపల్లి ఎస్ఐ డి.వెంకట్ కుమార్ దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడిపై తల్లి ఫిర్యాదు.. కేసు నమోదు

ఆకివీడు, ఫిబ్రవరి 18: కుమారుడు కొట్టాడని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు. కురుపాకకు చెందిన బొడ్డు సురేష్ తన తల్లి సావిత్రిని ఇంటిని తనపేరిట రాయాలని ఈనెల 16న గాయపర్చాడు. పెద్దల సమక్షంలో సమస్య పరిష్కారం కాకపోవడంతో కుమారుడు సురేష్‌పై తల్లి సావిత్రి ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

తెలంగాణ మద్యం స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్

పాలకొల్లు రూరల్, ఫిబ్రవరి 18 : కాపవరం గ్రామంలో పాలకొల్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం ఉదయం దాడి చేసి రూ.2,52,070 విలువైన తెలంగాణ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాపవరం రోడ్డులోని రొయ్యల చెర్వు వద్ద గల ఒక ఇంట్లో అనధికార మద్యం 110 సీసాలు, 72 బీరు సీసాలను స్వాధీన పరుచుకుని ఇద్దరిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని ఎస్ఈబీ అధికారులు తెలిపారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

- ఆర్అండ్ఆర్ కాలనీల పేరుతో తరలింపు
- అధికార పార్టీ నాయకుల అండతో మట్టి మాఫియా
- ట్రక్కు మట్టి రూ.700 నుంచి 1000

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 18 : పోలవరం నిర్వాసిత కాలనీల్లో మట్టి తోలకం పేరుతో కొందరు అధికార పార్టీ నాయకులు అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడుతున్నారు. గత పదిహేను రోజులుగా టి.గంగన్నగూడెం, రౌతుగూడెం, ములగలంపల్లి, దర్భగూడెం, రాచన్నగూడెం గ్రామాల్లో రాత్రి సమయాల్లో మట్టి తవ్వకాలు జోరందుకున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా కొందరు ఎక్స్‌కవేటర్ సాయంతో మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. అయా గ్రామాలు చింతలపూడి ఎత్తిపోతల పథకం కాల్వ గట్టు సమీపంలో ఉండడంతో మట్టి మాఫియాకు ఆ గట్లు ఆదాయం వనరులుగా మారాయి. ప్రస్తుతం పోలవరం నిర్వాసిత కాలనీలు నిర్మించే కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు మంజూరు కాక కొన్ని పనులు వాయిదా వేసి నిలిపి వేశారు. మరోవైపు నిర్వాసిత కాలనీల్లో అభివృద్ధి పనుల పేరుతో కొందరు మట్టి మాఫియాకు తెర తీశారు. ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకుని ట్రక్కు మట్టి రూ.700 నుంచి 1000 వరకు అమ్ముతున్నారు. మరికొందరు అయా కాల్వల వద్ద మట్టి అక్రమ రవాణా చేసే క్రమంలో స్థానిక గిరిజన నాయకుల పేరు చెప్పుకుని అక్రమ మట్టి రవాణా దందాలకు పాల్పడి సొమ్ముచేసుకుంటున్నారు.



ములగలంపల్లిలో మట్టి తవ్వకాలు జరుపుతున్న దృశ్యం

తరిగిపోతున్న కాల్వ గట్లు.. నమోదు కాని కేసులు

కొండలాంటి కాల్వ గట్లు సైతం కొన్ని చోట్ల తరిగిపోతున్నాయి. అక్రమ మట్టి తవ్వకాల విషయమై అరకొర పోలీస్, రెవెన్యూ అధికారులకు సమాచారం అందినా ఎక్స్‌కవేటర్ సంబంధిత మట్టి తరలించే ట్రాక్టర్లు స్థానికంగా ఉండడంతో అధికారుల్ని పక్కదోవ పట్టించి వాటిన కన్పించకుండా చేస్తున్నారు. మరి కొందరు మట్టి మాఫియా పనులు సాగించేందుకు నియోజకవర్గ స్థాయి అధికార, ప్రజాప్రతినిధి, లేదా అధికార పార్టీ మండల నాయకుల పేర్లు చెపపడం పరిపాటిగా మారింది. ఇటీవల కాలంలో మట్టి తవ్వకాలపై మండలంలో ఎక్కడా అధికారులు కేసులు నమోదు చేయలేదు. మట్టి తరలించే వారికి ఎటువంటి అనుమతులు ఉన్నాయో రెవెన్యూ అధికారులు సైతం పరిశీలన చేయకపోవడం గమనార్హం.

మంచు కురిసే వేళలో..

నరసాపురం/మొగల్తూరు, ఫిబ్రవరి 18: ఉదయం పదకొండు గంటలు దాటితే ఎండ వేడి భగభగమంటుంది. సాయంత్రం ఎనిమిది గంటలు దాటితే మంచు కమ్మేస్తుంది. ఉదయం తొమ్మిది గంటలు దాటిన మంచి వీడటం లేదు. ఆదివారం మంచు ప్రభావం మరింత ఎక్కువగా కనిపించింది. ఉదయం పది గంటలకు సూర్యుడు కనిపించలేదు. ఎటు చూసినా... పొగమంచే.. ఈ కారణంగా ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెళ్ళిళ్లు, ఇతర శుభకార్యక్రమాలు ఉండడంతో మంచులోనే బయటకు వచ్చారు. ఇటు గోదావరిని కమ్మేయడంతో పంటు రాకపోకలు ఉదయం తొమ్మిది గంటల వరకు సాగలేదు. నదిలో ఏమి కనిపించని పరిస్థితి నెలకొంది.

మొగల్తూరులో పొగమంచు

మొగల్తూరులో దట్టమైన పొగమంచు కురిసింది. ఆదివారం వేకువజాము నుంచి ఉదయం పది గంటల వరకు రహదారులను మంచు కమ్మేయడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తీరంలో ఇప్పుడిప్పుడే పూస్తున్న మామిడిపూత భారీగా కురుస్తున్న మంచు ప్రభావంతో పూత రాలిపోవడం లేదా మాడిపోవడంతో రైతులు, కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు.



మొగల్తూరు హైవేపై మంచు



నరసాపురంలో గోదావరిపై కమ్మేసిన పొగ మంచు దృశ్యాలు

గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతులకు న్యాయం చేయాలి


రైతుల సమావేశంలో శ్రీనివాస్

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 18: గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతులకు కలెక్టర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ కోరారు. మండలంలోని యర్రంపేటలో గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతుల సమావేశం ఆదివారం నిర్వహించారు. న్యాయమైన పరిహారం కోసం రైతులు ఉద్యమం చేసినా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. నష్టపరిహారం పెంచాలని కోరుతూ కలెక్టర్ కోర్టులో ఆర్బిట్రేషన్ దాఖలు చేసి సంవత్సరాలు గడుస్తున్న తీర్పు ఇవ్వడం లేదన్నారు. ఒక పక్క సర్వీసురోడ్లు లేక బోర్లు, విద్యుత్ ఏర్పాటు చేయ్యలేదన్నారు. ఆదేవిధంగా ఆయిల్‌ఫామ్, కొబ్బరి, ఉద్యాన పంటలకు పరిహారం పెంపు వంటి సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలు కూడా నెరవేరలేదన్నారు. ఇదే ప్రాంతంలో భద్రాచలం రైల్వే లైను పేరుతో మరలా భూసేకరణ జరుగుతుందని ప్రచారంతో రైతులు ఆందోళనలో ఉన్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో రైతులు కొడవటి రామకృష్ణ, పసల శ్రీను, రాంబాబు, సూర్యచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో పని చేయించడం తగదు


విలేకరులతో మాట్లాడుతున్న అప్పలనాయుడు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 18: రామానగర్ కాలనీ స్పెషల్ మునిసిపల్ పాఠశాలలో విద్యార్థులతో కూలి పనులు చేయిస్తున్నారని, నిర్మాణాలకు తోడ్పడే విధంగా వ్యవహరిస్తున్నారని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. జనసేన కార్యాలయం వద్ద ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంట్రాక్టర్లు, ఉపాధ్యాయులు విద్యార్థులతో పనులు చేయిస్తుంటే దానికి వైసీపీ నాయకులు అండగా ఉన్నారన్నారు. విద్యార్థుల కోసం ప్రభుత్వాలు ఎన్నో చట్టాలను రూపొందించినప్పటికి అవి అమలుకావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులతో వెట్టిచాకిరి చేయిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట జనసేన నాయకులు బీవీ.రాఘవయ్యచౌదరి, వీరంకి పండు, నగిరెడ్డి కాశీ నరేష్, సరిది రాజేష్, కందుకూరి ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

20 కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల యోజనలో 20 కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లు మంజూరయ్యాయి. జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో షేక్ నజీమా, లావణ్య, రత్నకుమారి, నసీమా, నళిని, కుమారి, సుప్రియ, జ్యోతి తదితరులు ఉన్నారు.

జిల్లాలో వాహనాల తనిఖీలు


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 18: రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆదివారం విజిబుల్ పోలీసింగ్ చేసి వాహనాల తనిఖీ చేపట్టారు. పోలీసు అధికారులు వాహనదారులతో మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు వాహనంతోనే ఉండాలని, వాహనం నడిపేవారికి డ్రైవింగ్ లైసెన్సు కచ్చితంగా ఉండాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ఏకాగ్రతతో నడపాలని ఏదైనా ప్రమాదం సంభవిస్తే కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని ఇంటి వద్ద ఉన్న కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకుని వాహనాలను అత్యంత జాగ్రత్తగా సురక్షితంగా నడుపుతూ గమ్య స్థానాలకు చేరుకోవాలని సూచించారు.

పెదవేగి మండలంలో జబర్దస్త్ కళాకారుల ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న జబర్దస్త్ కళాకారులు

పెదవేగి, ఫిబ్రవరి 18: జబర్దస్త్, సినీ గాయకుల బృందం అంకన్నగూడెం, రాట్నాలకుంట, పెదవేగి గ్రామాల్లో ఆదివారం పర్యటించి, బీజేపీ తరపున ప్రచారం నిర్వహించారు. ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఏలూరు నియోజకవర్గ పరిధిలో తపన ఫౌండేషన్ ద్వారా గారపాటి సీతారామాంజనేయ చౌదరి చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. మోదీ పాలన, తపన చౌదరి సేవలపై ప్రశ్నలు అడిగి, సమాధానాలు చెప్పిన ప్రజలకు సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ బహుమతులు అందించారు. సినీ గాయకుడు అరుణ్‌కౌండిన్య, జబర్దస్త్ బృందం ఆదిరే అభి, అప్పారావు, బాబీ, వినోదిని, ఇమ్మానియేల్ నవ్వులు పూయించారు. కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు ఉండవల్లి వెంకట్రావు, పెదవేగి మండల అధ్యక్షుడు పొన్నూరు శంకర్‌గౌడ్, నియోజకవర్గం కోకన్వీనర్ పెనుబోయిన రమేష్, కొత్త మధుసూదన్, పంచకర్ల రఘు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టం కలిగించే జీవో రద్దు చేయాలి

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 18: రైతుల భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం భూ యజమాన్య హక్కుల చట్టం (ల్యాండ్ టైటలింగ్ యాక్ట్) తీసుకువచ్చిందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. భూ హక్కుల చట్టం రద్దు చేయాలని కోరుతూ ఆదివారం పంగిడిగూడెం సెంటర్‌లో రైతు సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు నీతి ఆయోగ్ రూపొందించిన ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను దేశంలో మొదటిసారిగా ఏపీలో అమలు చేయాలని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం జీవో 512 జారీ చేయడం దుర్మార్గం అన్నారు. రైతులు, ప్రజలు ఈ చట్టం ద్వారా తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. భూ వివాదాలకు సంబంధించిన పరిష్కారం రెవెన్యూ అధికారులకే కట్టబెడుతూ నిబంధనలు రూపొందించారని చెప్పారు. అన్యాయం జరిగితే కోర్టులకు వెళ్లే అవకాశం లేకుండా చేయడం తగదన్నారు. సమావేశంలో రైతు సంఘం మండల నాయకులు బొడ్డు రాంబాబు, మాండ్రు సూర్యచంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని అందించే దేవాలయం గ్రంథాలయం


పుస్తక పఠనంలో విద్యార్థులు

పెదవేగి, ఫిబ్రవరి 18: గ్రంథాలయం విజ్ఞానాన్ని అందించే దేవాలయమని, ప్రతి ఒక్కరు గ్రంథపఠనం చేయాలని పెదవేగి లైబ్రేరియన్ తోట అరుణ్‌కుమార్ అన్నారు. శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. పలువురు విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి గ్రంథపఠనం చేశారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలలో అందించే చదువుతోపాటు గ్రంథాలయాల్లో పుస్తక పఠనం విద్యార్థుల భవిష్యత్‌కు సోపానం అన్నారు.

ఎనిమిది అడుగుల గోంగూర


భవనం అంత ఎత్తులో గోంగూరు మొక్క

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 18 : తెలుగు వంటకాల్లో పుల్ల గోంగూరకు ప్రత్యేకస్థానం ఉంది. గోంగూరతో చేసిన వంటకాలు, పచ్చడి లేనిదే భోజనం ఆరగించనివారూ లేకపోలేదు. శాఖాహారం, మాంసాహారప్రియులూ లొట్టలేసుకుని గోంగూర వంటకాలను లాగించేస్తారు. సాధారణంగా గోంగూర మొక్క గరిష్ఠంగా రెండు లేదా రెండున్నరడుగుల పొడవు ఉంటుంది. ఏలూరులో ఒక డ్రాయింగ్ టీచర్ ఇంట్లో పెంచుతున్న పుల్ల గోంగూర మొక్క ఏకంగా ఎనిమిది అడుగులకు పైగా పెరగడం ఆశ్చర్యం కలిగిస్తోంది. రూరల్ మండలం న్యూ అశోక్‌నగర్‌లో నివాసం వుంటున్న ఎండీ.ఇర్షాద్ అహ్మద్ శనివారపుపేట జడ్పీ హైస్కూలులో డ్రాయింగ్ టీచర్. మూడు నెలల క్రితం కొన్ని గోంగూర మొక్కలను కొనుగోలుచేసి ఇంటి పెరట్లో నాటారు. అప్పటి నుంచి శరవేగంగా ఎదుగుతున్న ఒక మొక్క ఇంటి ప్రహరీని దాటి భవనం పైఅంతస్తు దిశగా ఎగబాకుతోంది. ప్రస్తుతం ఎనిమిది అడుగుల ఎత్తు వున్న గోంగూర మొక్క మందంగా కాండం, కొమ్మలు, వెడల్పు ఆకులతో చూపరులను ఆకట్టుకుంటోంది. ఎటువంటి ఎరువులు వినియోగించలేదని, కేవలం కాళ్లు కడుక్కునే నీటినే మొక్కకు అందేలా ఏర్పాటుచేయడంతో సహజసిద్ధంగా పెరిగిందని అహ్మద్ వివరించారు. ఈ ప్రాంతంలో ఆకర్షణీయంగా ఉన్న పుల్ల గోంగూర మొక్కను తిలకించేందుకు స్థానికులు వస్తున్నారు.

అమ్మో ఆర్టీసీ

పల్లెలకు అరకొర రవాణా సౌకర్యం
మరమ్మతులతో మొరాయిస్తున్న బస్సులు
తరచూ ప్రమాదాలతో భయం.. భయం..


ఇటీవల జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లిలో జరిగిన ప్రమాదాల్లో దెబ్బతిన్న బస్సులు

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 18: ఆర్టీసీ ప్రయాణం ప్రయాణం సురక్షితం.. సుఖవంతం.. ఇది శాఖాపరమైన నినాదం. తరచు మరమ్మతులతో రోడ్లపై నిలిచిపోతున్న బస్సులు, ప్రమాదాలు ప్రయాణికులను భయపెడుతున్నాయి. అమ్మో ఆర్టీసీ ప్రయాణం అంటూ ఆందోళన వ్యక్తమవుతోంది. ఎప్పుడు ఎక్కడ బస్సులు నిలిచిపోతాయో తెలియని పరిస్థితి.. ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. 2021లో వేగవరం జల్లేరు వంతెనపై ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు 20 అడుగుల లోతులో కాలువలో పడడంతో 9 మంది మృత్యువాత పడ్డారు. మరెంతో మంది గాయపడ్డారు. ఈ ప్రమాదం ఆర్టీసీ ప్రయాణికుల్లో ఎంతో భయం కలిగించింది. ఆర్టీసీ వాహనాలు రోడ్లపై మొరాయించడం, స్టీరింగ్‌లు పట్టేయడం, బస్సు పరికరాలు ఊడిపోవడంతో, త్రుటిలో ప్రమాదాలు తప్పిపోవడం అక్కడక్కడ కనపడుతూనే ఉన్నాయి. ఈ నెల 15న ఒకేరోజు రెండు ప్రయాణాలు మరింత భయం కలిగించాయి. జంగారెడ్డిగూడెం పట్టణంలో ఆర్టీసీ బస్సును లారీ ఢీ కొనడంతో 27 మంది గాయపడ్డారు. జీలుగుమిల్లి వద్ద ఆర్టీసీ బస్సును వ్యాన్ వ్యాన్ ఢీ కొట్టడంతో ప్రయాణికులతో పాటు వ్యాన్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించిన రోజుల్లోనే ఈ రెండు ప్రమాదాలు జరగడం గమనార్హం.

జిల్లాలో ఇటీవవల ప్రజా రవాణా శాఖ వాహనాలు అతుకులు బతుకులతో కనీస నిర్వహణ లేకుండా ప్రజలు ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. డిపోలకు ఆదాయం ఎంత వచ్చిందనే తపనే తప్ప ప్రయాణికుల క్షేమం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాల బారిన పడిన అనేక మంది కోలుకోవడానికి ఎంత సమయం పడుతుందో తెలియదు. పేద మధ్యతరగతి వారే అధికంగా ఉపయోగించుకునే ఆర్టీసీ సేవలపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు నిత్యం జంగారెడ్డిగూడెం రాకపోకలు సాగిస్తుంటారు. ముంపు మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల నుంచి కూడా నిత్యం ఎంతో మంది ఇక్కడకు ఆర్టీసీ బస్సులపైనే వస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని యువత జంగారెడ్డిగూడెం పట్టణంలోని పలు ప్రైవేట్ సంస్థలు, దుకాణాలు, హోటల్స్, చిన్న చిన్న పనులు, ఉద్యోగాల నిమిత్తం పట్టణానికి వస్తున్నారు. పట్టణంలో విద్యా సంస్థలు, ఆసుపత్రులకు నిత్యం ఏజెన్సీ నుంచి వందలాది మంది వస్తున్నారు. వీరంతా కూడా ఆర్టీసీ బస్సుల్లోనే రాకపోకలు సాగిస్తారు. ఈ క్రమంలో ఆర్టీసీ ప్రమాదాలు కలవరపాటుకు గురి చేస్తున్నారు. జంగా రెడ్డిగూడెంలో ఈ నెల 15న జరిగిన ఆర్టీసీ రోడ్డు ప్రమాదంలో విద్యార్థులు, ఉద్యోగులు, ఆసుపత్రికి వెళ్లే వారే ఉన్నారు. ప్రమాదాల నివారణ, సురక్షిత ప్రయాణాలకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ వాసులు కోరుతున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చంటి


ముస్లిం మైనారిటీల సమావేశంలో మాట్లాడుతున్న నాగుల్ మీరా


కోయఅంకంపాలెం బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం

అన్ని వర్గాల ప్రజలను
మోసగించిన జగన్
వైసీపీ పాలనపై టీడీపీ శ్రేణుల ధ్వజం

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 18: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను జగన్ నమ్మించి మోసం చేశాడని టీడీపీ నియోజవకర్గ ఇన్‌చార్జి బడేటి చంటి అన్నారు. తాపీమేస్త్రీ కాలనీలో వేగి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం జరిగింది. చంటి మాట్లాడుతూ జగన్‌ను సాగనంపడానికి ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. వైసీపీ నాయకులకు డిపాజిట్లు కూడా దక్కకుండా ఓడించాలన్నారు. కార్యకర్తలంతా సైనికులుగా మారి టీడీపీ విజయానికి కృషి చేయాలన్నారు. ఎన్నికల సమయంలో శిలాఫలకాలు ఆవిష్కరిస్తూ జగన్ ప్రజలను మరోసారి మోసం చేయడానికి తయారయ్యాడని అన్నారు. వంద మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. చంటి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పెద్దిబోయిన శివప్రసాద్, దాసరి ఆంజనేయులు, నాయుడు సోము, వందనాల శ్రీనివాస్, జుంజు మోజేష్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలి

ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా కార్యకర్తలంతా చురుగ్గా టీడీపీ విజయానికి కృషి చేయాలని బడేటిచంటి అన్నారు. 33వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ కరణం లోకేశ్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం జరిగింది. నూటికి నూరు శాతం పార్టీ విజయానికి అంకిత భావంతో కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే మైనార్టీలకు రక్షణ

టీడీపీ ప్రభుత్వంలోనే ముస్లిం మైనార్టీలకు రక్షణ, సంక్షేమం, అభివృద్ధి జరిగిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కే.నాగూల్ మీరా, జిల్లా కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. టుబాకో కల్యాణ మండపంలో ఆదివారం ముస్లిం మైనార్టీలతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగూల్ మీర మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చి మైనార్టీ సంక్షేమ పథకాలకు రద్దు చేశారని మండిపడ్డారు. టీడీపీ హయాంలో సబ్సిడీ రుణాలు ఉన్నత విద్య, స్కాలర్‌షిప్‌లు, ఈమామ్, మౌజన్యకు గౌరవవేతనం, దుల్హన్ పథకంలో రూ.50వేలు, రంజాన్ తోఫా చంద్రబాబు అమలు చేశారన్నారు. జగన్ వాటిని రద్దు చేసి ముస్లింలను మోసం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో మైనార్టీలపై హత్యలు, దాడులు పెరిగిపోయాయన్నారు. బడేటి చంటి మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే మైనార్టీలకు రక్షణ అన్నారు. టీడీపీ, జనసేన ప్రభుత్వం రాగానే మరలా ముస్లింలకు మంచి రోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షనాష, ఆరిబ్, షేక్ సుభాని, అహ్మద్, సులేమాన్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికి సూపర్ సిక్స్ పథకాలు అమలు

బుట్టాయగూడెం: తెలుగుదేశం, జనసేన పార్టీలు అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులందరికి సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను అమలు చేస్తామని నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ అన్నారు. కోయ అంకంపాలెంలో నాయకులు, కార్యకర్తలతో కలసి ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు పి.నాగబాబు, కె.వెంకటేశ్వరరావు, గద్దె అబ్బులు, సున్నం నాగేశ్వరావు, మడకం రామకృష్ణ, టి.వెంకటేశ్వరావు, టి.రామారావు, ఎస్.రాము తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే నయం చేయవచ్చు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 18: క్యాన్సర్ నివారణ చాలా ముఖ్యమని, వ్యాధిని ముందుగానే గుర్తిస్తే చికిత్సతో నయం చేయవచ్చని ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు వీడీసీఎస్.లక్ష్మి అన్నారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు, బైక్ ర్యాలీ నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. క్యాన్సర్‌పై దీనిపై గ్రామస్థాయి వరకు ప్రజల్లో అవగాహన కల్పించి క్యాన్సర్ బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. నారా శేషు మాట్లాడుతూ క్యాన్సర్ సకాలంలో గుర్తిస్తే వ్యాధిని పూర్తిస్థాయిలో నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరి జి.అచ్యుత, పులి శ్రీరాములు, ఇళ్ల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ శానం శ్రీరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ క్రీడాకారిణి మోక్షితకు ఆర్థిక సాయం

ఏలూరు స్పోర్ట్స్, ఫిబ్రవరి 18: సీఆర్‌రెడ్డి పబ్లిక్‌స్కూల్లో 8వ తరగతి చదువుతున్న మావూరి మోక్షిత అండర్ -15 బాలికల రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపికైంది. ఆమెకు నారా శేషు రూ.25 వేలు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. భవిష్యత్‌లో విద్యార్థులు ప్రతిభకు అనుగుణంగా అడుగులు వేసి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. నగరానికి చెందిన మోక్షిత రాష్ట్రస్థాయి క్రికెట్‌టీమ్‌కు ఎంపిక కావడం హర్షణీయమన్నారు.

జయప్రకాష్ నారాయణను కలసిన వెంపా


జేపీ నారాయణతో దుర్గారావు

చింతలపూడి, ఫిబ్రవరి 18: చింతలపూడికి చెందిన వెంపా దుర్గారావు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణను ఆయన స్వగృహంలో ఆదివారం కలిశారు. రానున్న ఎన్నికల్లో దుర్గారావు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్టు ప్రకటించారు. 4 మండలాల్లో ప్రచార బోర్డులు ఏర్పాటు చేశారు. ఇటీవల చింతలపూడిలో నిరుద్యోగుల కోసం 60 కంపెనీలను ఆహ్వానించి జాబ్‌మేళా నిర్వహించారు. దుర్గారావు సేవా కార్యక్రమాలను చూసిన పలువురు జయప్రకాష్ నారాయణను కలవాలని సూచించారు. నియోజకవర్గంలోని సమస్యలు, పరిపాలన విధానం, సేవా కార్యక్రమాలు, పలు అంశాలపై ఆయన అడిగారని, ఇక్కడి సమస్యలు తెలిపినట్టు దుర్గారావు చెప్పారు. యువత ముందుకు వచ్చి ఇటువంటి కార్యక్రమాలు చేపట్టాలని అభినందించారన్నారు.

బీజేపీకి మద్దతిచ్చే పార్టీలను వ్యతిరేకించండి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 18: బీజేపీకి మద్దతు తెలుపుతున్న రాజకీయ పార్టీలను వ్యతిరేకించాలని, ఈ నెల 20న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు ఎ.రవి, కృష్ణచైతన్య విజ్ఞప్తి చేశారు. విజయవాడ మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు జరుగుతుందన్నారు. ప్రత్యేకహోదా, విభజన హామీలు ఇవ్వకుండా విశాఖ ఉక్కు అమ్మకానికి పెట్టిన బీజేపీని వ్యతిరేకించాలన్నారు.

యాచకులకు ఆహార పొట్లాల పంపిణీ

భీమడోలు, ఫిబ్రవరి 18: విన్సెంట్ దీపాప్ సొసైటీ ఆధ్వర్యంలో 40 మంది యాచకులకు సొసైటీ కార్యదర్శి ఎం.షరీన్ ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. కెనడి, రమేష్, ప్రభాకర్, రాజారావు, బాలరాజు పాల్గొన్నారు.

మార్చి 7 వరకు కోర్టు విధుల బహిష్కరణ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 18: న్యాయవాదులు మార్చి 7 వరకు కోర్టు విధులను బహిష్కరించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ టైటిలింగ్ యాక్టు 27/23ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత కొంత కాలం నుంచి కోర్టు విధులను బహిష్కరించి జిల్లా కోర్టు గేటు బయట రిలే నిరాహారదీక్షలను కొనసాగిస్తున్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మరోమారు న్యాయవాదులు ఆదివారం సమావేశం అయ్యారు. మార్చి 7 వరకు కోర్టు విధులను బహిష్కరించి రిలే నిరాహారదీక్షలను కొనసాగించాలని తీర్మానించారు. ప్రతి రోజు రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తారు.

స్నేహితుడికి రూ.1.82 లక్షల సహాయం

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 18: జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985-90 సంవత్సరాల్లో విద్యనభ్యసించిన విద్యార్థులు కష్టంలో ఉన్న తమ సహచరుడికి రూ.1,82,700 సహాయం అందించారు. వేగవరానికి చెందిన వికలాంగుడు కాగితాల భద్రరావు రెండేళ్ల నుంచి పక్షవాతంతో మంచానికే పరిమితం కావడంతో స్పందించిన పూర్వ విద్యార్థులు ఇచ్చిన మొత్తాన్ని గ్రామ సర్పంచ్ లక్కబత్తుల నాగరాజు ఆదివారం భద్రరావుకు అందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు, కొండా ఉమమహేష్, రషీద బేగం, సంకు ప్రభాకర్, పాలూరి లక్ష్మణరావు, గ్రామ పెద్దలు నులకాని నాగబాబు, ధర్మరాజు, అనిశెట్టి శ్రీనివాసరావు, ప్రగడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

జీవో నెంబరు 3 ప్రకారం పోస్టులు భర్తీచేయాలి

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 18: డీఎస్సీలో షెడ్యూల్ ప్రాంతాల్లో జీవో నెంబరు 3 ప్రకారమే పోస్టులను భర్తీచేయాలని ఏపీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబరు 3 అమలు చేయకుండా 2024 డీఎస్సీలో గిరిజనేతరులకు 99 శాతం పోస్టులలో అవకాశం కల్పించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సంక్షేమ శాఖలో 506 పోస్టులు ఖాళీగా ఉండగా ఆదివాసీలకు దక్కేది కేవలం 25 మాత్రమే అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 153 పోస్టుల్లో ఎస్టీలకు 9, ఏలూరు జిల్లాలో 280 పోస్టులకు ఆదివాసీలకు 12 పోస్టులు మాత్రమే దక్కుతున్నట్లు తెలిపారు. గిరిజనేతరులకు అధిక పోస్టులు దక్కుతున్నాయని తెలిపారు. గతంలో జీవో నెంబరు 3 వలన ఏజెన్సీ ప్రాంతంలో డిఎస్సీ ద్వారా నూరుశాతం రిజర్వేషన్ ఆదివాసీలు పొందేవారని గుర్తు చేశారు.

135 మందికి కంటి పరీక్షలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 18: రామకోటి ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వేమగిరి పరమానంద నేత్ర వైద్యశాల నిపుణులు 135 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 32 మందికి దృష్టిలోపం ఉన్నట్టు గుర్తించి కళ్లజోళ్లు అందజేశారు. 16 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని ఎంపికలు చేశారు. మానేపల్లి రామారావు, పరసా శ్రీనివాసరావు, బొలిశెట్టి సురేష్‌కుమార్, పండరీనాద్, చెన్నా వెంకట్రామయ్యలు సేవలు అందించారు.

గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం


మృతదేహం చేతిపై పచ్చబొట్టు

కొవ్వూరు, ఫిబ్రవరి 18: గోదావరి నదిలో గుర్తుతెలియని పురుషుడి మృతదేహన్ని పట్టణ పోలీసులు గుర్తించారు. కొవ్వూరులోని ఔరంగాబాద్ ఇసుక ర్యాంపు సమీపంలో గోదావరి నదిలో మృతదేహం తేలుతుందని స్థానికుల సమాచారంతో హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు సిబ్బందితో ఆదివారం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీయించి, ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి సుమారు 40 ఏళ్ల వయస్సు ఉంటుందని, చేతిపై డాడి, మోహన్ అని పచ్చబొట్టు ఉందన్నారు. మృతుడు జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాలకు చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు పట్టణ పోలీసుస్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి, ఫిబ్రవరి 18: రాట్నాలకుంట రాట్నాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పాలపొంగలి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి సత్యనారాయణశర్మ, రుద్రపాక శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీష్‌కుమార్ తెలిపారు.

20 నుంచి వేణుగోపాలుని కల్యాణోత్సవాలు


రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 18 : తూర్పు వీధిలో రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ఈనెల 20 నుంచి 25 వరకు కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు. 20న స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరిస్తామని నిర్వాహకులు తెలిపారు. 23న కళ్యాణ మహోత్సవం జరుగుతుందని తెలిపారు. 24, 25 తేదీలలో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహిస్తామని తెలిపారు.

నేడు అభయాంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ


కలశాల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కామవరపుకోట, ఫిబ్రవరి 18: తడికలపూడిలో నిర్మించిన ఆలయంలో సోమవారం అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయం వద్ద ఆదివారం భక్తులు సామూహిక పూజలు, హోమాలు చేశారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలియచేశారు.

అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవం

ఏలూరు కల్చరల్, ఫిబ్రవరి 18: చాటపర్రు రోడ్డులోని వినాయకనగర్ అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ధర్మకర్త శెట్టిబాబురావు, అధ్యక్షులు తాండ్రంగి రాజేష్, కార్యదర్శి చిన్ని జనార్దన్ పర్యవేక్షించారు.

22 నుంచి కనకదుర్గమ్మ ఉత్సవాలు

టి.నరసాపురం, ఫిబ్రవరి 18: బొర్రంపాలెంలో ఈ నెల 22 నుంచి 26 వరకు కనకదుర్గమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వీరంకి వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఐదు రోజుల ఉత్సవాల్లో కనకదుర్గమ్మకు విశేష పూజలు నిర్వహిస్తారు. చివరి రోజు సోమవారం అన్న సమారాధన చేస్తారు.

విశాఖ పీఠాధిపతిగా జయరావుకు అదనపు బాధ్యతలు

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 18: ఏలూరు కథోలిక పీఠాధితి జయరావు పొలిమేర విశాఖపట్నం పీఠాధిపతిగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఆయనకు టీడీపీ నియోజవకర్గ ఇన్‌చార్జి బడేటి చంటి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జుంజు మోజేష్, లంకపల్లి మాణిక్యాలరావు, బెనర్జి, పాల్గొన్నారు.

వీధి కుక్కలతో భయం.. భయం..

• లింగపాలెం మండలంలో పెరిగిన కుక్కకాటు కేసులు • రెండు నెలల్లో 150 మంది బాధితులు


వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

లింగపాలెం, ఫిబ్రవరి 18: మండలంలో వీధికుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. గ్రామాల్లో గుంపులుగా వీధి కుక్కల సంచారంతో ప్రజలు, పాదచారులు హడలి బెదిరిపోతున్నారు. తరచు వీధి కుక్ల దాడిలో వృద్ధులు, పిల్లలు గాయపడుతున్నారు. ధర్మాజీగూడెం, కె.గోకవరం, లింగపాలెం గ్రామాల్లోని పీహెచ్‌సీల్లో ప్రతిరోజూ కుక్క కాటు బాధితులు చికిత్స పొందుతున్నారు. ఒక్కొక్క పీహెచ్‌సీకి ఇద్దరు నుంచి ముగ్గురు కుక్కకాటు బాధితులు వెళుతున్నారు. మండలంలో జనవరి నుంచి ఇప్పటివరకు కుక్కకాటు బాధితుల సంఖ్య సుమారు 150 పైగా ఉండడం సమస్య తీవ్రతకు అద్దం పడుతుంది. అన్నపనేనివారిగూడెంలో కుక్కకాటుతో ర్యాబిస్ వ్యాధిసోకి ఒక బాలుడు మృతి చెందాడు. బాలుడు మరణించినా అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి తమను కాపాడే ప్రయత్నాలు చేయడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. మండలంలో కుక్కల సంఖ్య పెరుగుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బయటకు వస్తే ఎటునుంచి కుక్క వచ్చి తమను కరిచి వెళుతుందోనని భయపడుతున్నారు. కుక్కల బారి నుంచి రక్షించాలంటూ ప్రజలు వేడుకొంటున్నారు.

పీహెచ్‌సీలో వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉంచాం : డాక్టర్ కృష్ణ కిశోర్



మండలంలోని మూడు పీహెచ్‌సీలలో కుక్కకాటుకు ర్యాబిస్ సోకకుండా వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. కుక్కకాటు గాయాన్ని సబ్బుతో శుభ్రంగా కడిగి వెంటనే దగ్గర్లోని పీహెచ్‌సీకి తీసుకువస్తే వ్యాక్సిన్ వేసి ర్యాబిస్ సోకకుండా చర్యలు తీసుకుంటాం. పెంపుడు కుక్కలు ఉన్న వారు ప్రతి రెండు నెలలకు ఒకసారి ర్యాబిస్ రాకుండా వ్యాక్సిన్ వేయించుకోవడం మంచిది.

చర్యలు చేపడతాం : వి.రాంబాబు, ఎంపీడీవో



ఇటీవల మండలంలో కుక్కకాటుతో అనేకమంది గాయపడుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఉన్నతాధికారులతో మాట్లాడి పెంపుడు కుక్కలకు, వీధి కుక్కలకు ర్యాబిస్ సోకకుండా వ్యాక్సిన్ వేసేలాగా చర్యలు తీసుకుంటాం. వీధికుక్కలను పట్టించి వాటి సంతతి పెరగకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేలా చర్యలు చేపడతాం.

సైబర్ వలకు చిక్కిన వైద్యుడు

- రూ.2 లక్షలు పోగొట్టుకున్న వైనం
- కేసు నమోదు చేసిన ముదినేపల్లి పోలీసులు

ముదినేపల్లి, ఫిబ్రవరి 18 : ఆన్‌లైన్ లింకుల జోలికి వెళ్లి సొమ్ము పోగొట్టుకోవద్దని పోలీసు అధికారులు చెబుతున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో కొందరు సైబర్ మోసాల్లో ఇరుక్కుంటున్న ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. ముదినేపల్లిలో తాజాగా మరో సైబర్ క్రైం బయటపడింది. ముదినేపల్లి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముదినేపల్లిలోని గురజ రోడ్డులో నేత్ర వైద్యశాల నిర్వహిస్తున్న వైద్యుడు ఎం.శివరామకృష్ణ ఆన్‌లైన్‌లో వచ్చిన ఒక లింకును చూసి గత రెండు నెలలుగా సొమ్మును పెట్టుబడి పెట్టడం ప్రారంభించారు. ఈ ఏడాది జనవరిలో ఆ లింకును ఓపెన్ చేసి రూ.80 వేలు పంపారు. అందుకు ప్రతిఫలంగా ఆయన అకౌంట్‌లో లింకుదారుడు రూ.3 వేలు జమ చేశాడు. అనంతరం జనవరి 7 నుంచి 15 వరకు మరి కొంత సొమ్ము ఆన్‌లైన్ లింకులో పెట్టుబడి పెట్టారు. సొమ్ము అంతా కలపి రూ. 2.03 లక్షలకు చేరింది. అప్పటి నుంచి తిరిగి లింకు ఓపెన్ కావటంలేదు. కొంతకాలం వేచి చూసినా ఫలితం లేక బాధితుడు సైబర్ క్రైం విభాగానికి ఫిర్యాదు చేశారు. సైబర్ క్రైం అధికారుల నుంచి అందిన సమాచారం మేరకు ఆదివారం ముదినేపల్లి ఎస్ఐ డి.వెంకట్ కుమార్ దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారును ఢీకొన్న టిప్పర్.. నిలిచిన ట్రాఫిక్



ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 18: వేగంగా వస్తున్న టిప్పర్ రోడ్డు పక్కన నిలిచి ఉన్న కారుని ఢీ కొట్టడంతో కారు నుజ్జునుజ్జ యింది. స్థానికుల వివరాల ప్రకారం గుడివాడ వైపు నుంచి వస్తున్న టిప్పర్ శ్రీహరిపురం పాత పంచాయతీ కార్యాలయం సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న కారును ఢీ కొట్టింది. కారులో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. భారీ క్రేన్ల సాయంతో టిప్పర్‌ను తొలగించే క్రమంలో రహదారి ఇరువైపులా భారీగా ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



వలంటీర్లకు సేవా దృక్పథం అవసరం

ముదినేపల్లి, ఫిబ్రవరి 18 : గ్రామ సచివాలయాల వలంటీర్లు సేవా దృక్పథమే ప్రధాన ధ్యేయంగా పని చేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వలంటీర్ల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ జయమంగళ మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా వలంటీర్లు వ్యవహరించి అందరి మన్ననలు పొందాలన్నారు. బొమ్మినంపాడు పొన్నమూడి నాగబాబుకు సేవా వజ్ర, మందాడ నాగలక్ష్మి, దండే శారద, సాయల నాగ మల్లేశ్వరరావు, గొర్ల ఈశ్వరి దుర్గ, కురెళ్ల స్రవంతిలకు సేవా రత్న అవార్డులను అందజేసి సత్కరించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, ఎంపీడీవో గంగాధరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. కొరగుంటపాలెం వలంటీర్‌గా పని చేస్తూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గడప గడపకు కార్యక్రమ నోడల్ అధికారిగా ప్రభుత్వోద్యోగం పొందిన బండారు వల్లీ దేవిని సత్కరించారు.



ముదినేపల్లిలో బహిర్భూమిగా మారిన అంతర్గత సీసీ రోడ్డు

ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే

- బహిర్భూమిగా రహదారి
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

ముదినేపల్లి, ఫిబ్రవరి 18: ముదినేపల్లి పంచాయతీ పరిధిలో ప్రధానమైన ఒక రహదారి దుర్గంధ భరితంగా మారింది. జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లేందుకు ఉపయోగపడే సీసీ రహదారి వెంబడి వెళ్లాలంటే ముక్కుమూసుకోవాల్సిందే. ప్రధానమైన ఈ రహదారిని ఏళ్ల తరబడి జనం బహిర్భూమిగా ఉపయోగిస్తుండటంతో అటు వైపు కన్నెత్తి చూడాలంటేనే అసహ్యంగా ఉంటోంది. పంచాయతీ అధికారులకు ఈ రోడ్డు అధ్వాన స్థితిపై ప్రజలు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ రోడ్డు ప్రారంభంలోనే ప్రస్తుతం ముదినేపల్లి గ్రామ సచివాలయం-1 కార్యాలయ భవనం నిర్మిస్తున్నారు. మంచినీటి చెరువు కూడా ఈ రోడ్డు శివారులో ఉంది. దుర్గంధభరితమైన ఈ రోడ్డు పక్కనే పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం ఉన్నాయి. విద్యార్థులతో పాటు సమీప ఇళ్లలోని వారు దుర్గంధం భరించలేకపోతున్నామని వాపోతున్నారు. అన్ని వర్గాల వారికి రహదారి సౌకర్యం కల్పించాల్సిన ఈ పంచాయతీ రోడ్డులో బహిర్భూమిగా మారటంతో కాలు మోపే అవకాశం లేకుండాపోయింది.

రోడ్డు ఉన్నా ఉపయోగం సున్నా



రోడ్డు ఉండీ ఉపయోగం లేకుండా పోయింది. స్వచ్ఛభారత్ ప్రసంగాలకే పరిమితమైంది. ఈ రహదారిని పంచాయతీ అధికారులు బాగు చేయాలి. గ్రామస్థులు వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలి.

-కోడూరు అర్జునరావు, గ్రామస్థుడు



అటపాక-అగ్రహారం రహదారిలో వంతెనపై రైలింగ్ లేని దృశ్యం

అమ్మో.. వంతెనలు!

- రైలింగ్ విరిగి శిథిలావస్థకు చేరి ప్రమాదాలు
- కన్నెత్తి చూడని అధికారులు, ప్రజాప్రతినిధులు

వంతెనలు దడ పుట్టిస్తున్నాయి. రైలింగ్ విరిగి కొన్ని, ఊగుతూ మరికొన్ని ఇలా ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. కైకలూరు మండలం అటపాకలో పంటకాల్వపై వంతెనకు ఒక పక్క రైలింగ్ పూర్తిగా విరిగిపోయింది. రాత్రి సమయంలో కనిపించక పలువురు ప్రమాదాలకు గురయ్యారు. ఇక ముదినేపల్లి మండలం కాకరవాడ గ్రామంలో అన్నవరం డ్రైన్‌పై వంతెన భారీ వాహనాలు వెళితే ఊగుతోంది. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు.

కైకలూరు, ఫిబ్రవరి 18: వైసీపీ పాలనలో రహదారులు అధ్వానంగా ఉండడమే గాక పంట, మురుగు కాలువలపై వంతెనలు శిథిలావస్థకు చేరి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడ చూసినా వంతెనలపై రైలింగ్ లేక మరిన్ని ప్రమాదాలకు దారితీస్తున్నాయి. నిత్యం వేలాది మంది ప్రయాణించే రహదారుల్లో వంతెనలు శిథిలావస్థకు చేరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం మరమ్మతులు కూడా నిర్వహించకపోవడం వాహనదారులకు శాపంగా మారింది. కైకలూరు మండలం అటపాక నుంచి అగ్రహారం వెళ్లే రహదారిలో పంటకాలువ వంతెనపై రక్షణ గోడ లేక ఇటీవల పలు ప్రమాదాలు జరిగాయి. సమీపాన రైల్వే గేటు ఉండడంతో రైళ్ళ రాకపోకల సమయంలో ఈ వంతెన గుండా రహదారిలో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ద్విచక్ర వాహనదారులు రాత్రి సమయాల్లో కన్పించక ప్రమాదాలకు గురైన సందర్భాలు గత నెలలో చోటు చేసుకున్నాయి. ఇటీవల ఇసుక టిప్పర్లు, భారీ వాహనాలు వెళ్లడంతో వంతెనలు మరింత శిథిలమవుతున్నాయి. సామర్థ్యానికి మించి ఇసుక రవాణా జరగడంతో వంతెనలు కూలిపోయే పరిస్థితులు నెలకొన్నాయంటూ స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు మరమ్మతులు చేయించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భారీ వాహనాలు వెళుతుంటే ఉయ్యాల.. జంపాల!



భారీ వాహనాలొస్తే ఊగే కాకరవాడలో అన్నవరం డ్రైన్‌పై వంతెన.. కుడివైపు దిమ్మె విడిపోయి ఉండడాన్ని గమనించవచ్చు

ముదినేపల్లి: ముదినేపల్లి మండలం కాకరవాడ గ్రామం వద్ద అన్నవరం మీడియం డ్రైన్‌పై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుని ప్రమాద స్థితిలో ఉంది. సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన బీటలు వారటమే కాక, రెయిలింగ్స్ కూడా విరిగిపోతున్నాయి. నిర్మించిన నాటి నుంచి నేటి వరకు ఈ వంతెన పరిస్థితిని పట్టించుకున్న వారే లేరు. ఇటీవల కాలంలో లోడు వాహనాల రాకపోకలు పెరగటంతో వంతెన సామర్థ్యం చాలక బీటలు వారింది. ఇరువైపులా ఉన్న సిమెంట్ దిమ్మెలు కూడా స్లాబు నుంచి విడిపోయి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. స్లాబు అడుగు భాగం కూడా ఊడిపోతోంది. శ్రీహరిపురం నుంచి కాకరవాడ, దేవరం గ్రామాలకు వెళ్లేందుకు ఈ వంతెన ఒక్కటే రవాణాకు అనుకూలం. భారీ వాహనాలు వెళ్లేటప్పుడు వంతెన ఊగుతున్నదని కాకరవాడ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో పీడబ్ల్యూడీ శాఖ నిధులతో నిర్మించిన ఈ వంతెన బాగోగులు ఇప్పుడు ఏ శాఖ చూడాలన్నది ప్రశ్నార్థకంగా మారింది. డ్రైనేజీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఈ వంతెన నిర్వహణ బాధ్యత తమది కాదంటే తమది కాదని అంటున్నారు.

జగన్ మాటలు నమ్మి మోసపోవద్దు

మండవల్లి, ఫిబ్రవరి 18: జగన్ ప్రభుత్వం దోపిడీమయమని, వైసీపీ నాయకుల మాయమాటలు నమ్మి మళ్లీ మోసపోవద్దని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండవల్లి మండలం సింగనపూడి, ఉనికిలి గ్రామాల్లో ఆదివారం జరిగిన ఆత్మీయ సమావేశాల్లో కామినేని మాట్లాడుతూ పేదలు- పెత్తందారులకు మధ్య యుద్ధం అని సీఎం జగన్మోహనరెడ్డి అంటున్నారని, దేశ రాజకీయ నాయకుల్లో జగన్‌కంటే డబ్బున్న వారు ఎవరూ లేరన్నారు. రాజధాని లేని రాష్ట్రం మనదేనని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకపోవడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. కరెంటు బిల్లులు దారుణంగా పెంచిన ఘనత జగన్ ప్రభుత్వానిదేనన్నారు. నియోజకవర్గంలో అరాచకాలు పెరిగిపోతున్నాయని, బలహీనవర్గాలకు తీవ్ర నష్టం జరుగుతోందని అందరూ కలసికట్టుగా ఈ అరాచక పాలనపై పోరాడాలని, తాను అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు. టీడీపీ రాష్ట్ర వైద్య విభాగం మాజీ అధ్యక్షుడు వెంకటరావు, టీడీపీ మండవల్లి మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, బలే ఏసురాజు, తెలుగురైతు నాయకుడు ముళ్లపూడి సత్తిబాబు, టీడీపీ నాయకుడు చాపరాల దుర్గాప్రసాద్, జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్, పలు గ్రామాల టీడీపీ సర్పంచ్‌లు ఎంపీటీసీలు పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి. భైరవపట్నం నుంచి సింగనపూడి, ఉనికిలి వరకు టీడీపీ-జనసేన నాయకులు భారీ మోటార్ సైకిల్ ర్యాలీతో ఆత్మీయ సమావేశానికి చేరుకున్నారు.



సింగనపూడిలో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కామినేని



రమణక్కపేటలో సాగుదారులు, లిబరేషన్ నాయకుల ఆందోళన

పేదల సాగు భూములు నమోదు చేయాలి

ముసునూరు, ఫిబ్రవరి 18: పేదలు సాగుచేసుకుంటున్న అటవీ భూములను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ మండల కార్యదర్శి వేముల బక్కయ్య డిమాండ్ చేశారు. ఆదివారం రమణక్కపేటలో సాగుదారులు, లిబరేషన్ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బక్కయ్య మాట్లాడుతూ సాగుదారులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈ నెల 6న జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు ఈ భూములపై అర్జీ అందజేయగా, ఆయన అర్హులకు సంబంధించిన భూములను సాగు రికార్డుల్లో నమోదు చేయాలని తహసీల్దార్‌కు ఆదేశాలను జారీ చేసి పది రోజులు గడుస్తున్నా ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగుదారులందరితో సమావేశం ఏర్పాటు చేసి, సాగుభూముల వివరాలను రికార్డు చేసి, కమిటీ ఆధ్వర్యంలో నివేదికను ప్రభుత్వానికి పంపాలని ఆయన కోరారు. ఫారెస్ట్ సెటిల్‌మెంట్ కోర్టులో ఉన్న క్లైంలను తక్షణమే పరిష్కరించాలని, పేదలు సాగు చేస్తున్న భూములను సెటిల్‌మెంట్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతుల సమక్షంలో విచారణ జరిపి పట్టాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మండల కమిటీ సభ్యులు తోట సుబ్బారావు, ఉప్పే రాంబాబు, మత్తే వీరబాబు, ముక్కు నాగేశ్వరరావు, బర్మా సాంబయ్య, ఉప్పే శ్రీనివాసరావు, పరకాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ నియంతృత్వ పాలన చూపే రాజధాని ఫైల్స్



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కైకలూరు, ఫిబ్రవరి 18: జగన్మోహన్‌రెడ్డి నియంతృత్వ పాలనను చూపుతూ రాజధాని ఫైల్స్ సినిమా తీశారని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పి. రాధాకృష్ణ అన్నారు. ఆదివారం కైకలూరులో సినిమా ప్రారంభం సందర్భంగా టీడీపీ నాయకులు చిత్రాన్ని చూసిన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. సినిమా విడుదల అడ్డుకున్నా కోర్టు అనుమతులు రావడంతో ప్రదర్శన జరుగుతోందన్నారు. టీడీపీ నాయకులు బంకపల్లి భాస్కర్, వీరాబత్తిన సుధా, లక్కింశెట్టి మోహన్, గడిదేశి విజయకుమార్, గట్టమనేని దత్తు, తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ టెస్ట్‌లో హేమశ్రీ ప్రతిభ



కైకలూరు, ఫిబ్రవరి 18: ఇటీవల ఎడ్యుకేషనల్ ఇపిఫిని ఎన్జీవో సంస్థ ఆన్‌లైన్లో నిర్వహించిన మెరిట్ టెస్ట్‌లో ఏలూరు జిల్లా ప్రభుత్వ పాఠశాలల నుంచి 531 మంది పాల్గొనగా వీరిలో కైకలూరు మండలం జంగంపాడు గ్రామ ఎంపీ యూపీ పాఠశాల విద్యార్థిని షైలా హేమశ్రీ ప్రథమ స్థానం పొందింది. శనివారం విజయవాడలో పాఠశాల విద్యా కమిషనర్ ఎస్. సురేష్‌కుమార్ చేతులమీదుగా రూ.5 వేలు నగదు, మెమెంటో అందుకుంది. ఆమెను ఎంఈవోలు డి. రామారావు, వి. శ్రీనివాసరావు అభినందించారు. హెచ్ఎం కెవీవీఎస్ సత్యనారాయణ, ఉపాధ్యాయుడు పి. సురేష్‌కుమార్ రెండేళ్లుగా ఈ టెస్టులకు విద్యార్థులను ప్రత్యేక శిక్షణ ఇచ్చి పంపిస్తున్నారు. గత ఏడాది జరిగిన మెరిట్ టెస్టులో ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థి కూడా మొదటిస్థానం సాధించినట్టు తెలిపారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వైసీపీ నాయకులు, స్థానికులు

ఇళ్ళ స్థలాలకు భూమిని కేటాయించండి

ముసునూరు, ఫిబ్రవరి 18: ముసునూరులో పేదల ఇళ్ల స్థలాల కోసం భూమిని కేటాయించాలని వైసీపీ నాయకులు రేగుల గోపాలకృష్ణ, తులిమెల్లి సుబ్బారావుతోపాటు స్థానికులు తహసీల్దార్ జవహర్ బాజీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ మూడేళ్ళ క్రితం ముసునూరు శివారు సంధ్యవాగు వద్ద జగనన్న కాలనీ ఇళ్ల స్థలాలకు ఒక రైతు నుంచి ప్రభుత్వం భూమిని కొనుగోలు చేసిందని, దానిలో రోడ్లు వేసి, లేఔట్ వేయడం జరిగిందన్నారు. అయితే ఆ భూమి గ్రామానికి దూరంగా ఉండటం, నివాసాలకు అనువుగా లేదని ఆ స్థలం వద్దని లబ్ధిదారులు ఆందోళనలు చేశారన్నారు. అయితే రైతుకు భూమి నిమిత్తం ప్రభుత్వం ఇచ్చిన నగదును తిరిగి ప్రభుత్వానికి చెల్లించేందుకు జిల్లా కలెక్టర్‌కు అర్జీ ఇచ్చాడన్నారు. అయితే నేటికీ ఆ సొమ్ము తీసుకుని రైతుకు భూమికి అప్పగించే ప్రక్రియ జరగలేదన్నారు. ఇప్పటికైనా భూమిని రైతుకు అప్పగించి, ఆ సొమ్ముతో ఇళ్ళస్థలాలకు అనుకూలంగా ఉన్న భూమిని కేటాయించాలని తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు.

అసమర్థ నాయకత్వంలో ప్రజల భవిత చీకటి

నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రకాష్



నూజివీడు, ఫిబ్రవరి 18: అసమర్థ నాయకత్వంతో రాష్ట్ర ప్రజల భవిష్యత్తు అంధకారమేనని నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్ అన్నారు. నూజివీడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమాల్లో పనిచేస్తే విద్యార్థి సమస్యలు తెలుస్తాయని, కార్మిక రంగంలో పని చేస్తే కార్మికుల సమస్యలు, పొలం పనిచేస్తే రైతుల కష్టాలు తెలుస్తాయని కనీసం ఇవేమీ కాకున్నా మధ్యతరగతి వారైతే పేదల కష్టసుఖాలు తెలుస్తాయని, ఏ కష్టం తెలియని వారిని చట్టసభల్లో శాసనాలు చేయమంటే పర్యవసానం ప్రస్తుత రాష్ట్రపరిస్థితి ఉన్నట్టే ఉంటుందన్నారు. ఒకప్పుడు ప్రజల హక్కుల కోసం చట్టాలు చేసిన చరిత్ర శాసనసభదని ఇప్పుడు ప్రజల హక్కులను హరించే చట్టాలను చేస్తోంటే ప్రశ్నించినా ఫలితం లేని దుస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. ల్యాండ్ టైటిల్‌యాక్ట్ అనే చట్టం భవిష్యత్ తరాల ఆస్తి హక్కును ప్రశ్నార్థకం చేస్తోందన్నారు. తమకు అవసరమైన భూములను సమస్యాత్మక భూములుగా సృష్టించి తద్వారా ప్రభుత్వ, ప్రజల భూములను కైంకర్యం చేసేందుకు తయారు చేసిందే ఈ చట్టం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ల్యాండ్ టైటిల్ యాక్ట్‌కు వ్యతిరేకంగా న్యాయవాదులు ఉద్యమాన్ని చేపడితే వారిలో చీలిక తెచ్చి ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ప్రజలు ఈ చట్టం లాభ నష్టాలను నిజానిజాలను తెలుసుకోవాలని ఆయన కోరారు.

చాట్రాయిలో పల్లెకు పోదాం



చాట్రాయి, ఫిబ్రవరి 18: పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు ఆదివారం తహసీల్దార్ మహ్మద్ మసూద్ అలీ, ఏఎస్ఐ గజపతిరావు, పీహెచ్‌సీ వైద్యాధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలను కలసి కేంద్రం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఓబిళ్ళనేని రాజా, పార్టీ నాయకులు ఆదిమూలం శర్మ, కలవల సుబ్బారావు, బుర్రి శ్రీకర్, మందపాటి విద్యాధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా శోభనాచలేశుడి కల్యాణం



ఆగిరిపల్లి, ఫిబ్రవరి 18: మాఘ రథసప్తమి తిరునాళ్ళలో భాగంగా ఆదివారం శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. కైంకర్యపరులుగా నాగిరెడ్డి అప్పారావు పాల్గొన్నారు. సాయంత్రం చిన శేషవాహనంపై స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం జరిగిన నిత్య కల్యాణంలో కైంకర్య పరులుగా ఆగిరిపల్లి ఆర్యవైశ్య సంఘం నుంచి 10 జంటలు పాల్గొన్నాయి. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.



బూరుగ్గూడెంలో వృద్ధాశ్రమం ప్రారంభం

చాట్రాయి, ఫిబ్రవరి 18: బూరుగ్గూడెంలోని తన స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య, తన తండ్రి సుబ్బారావు స్మృత్యర్థం ఏర్పాటు చేసిన వృద్ధాశ్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. మండలానికి చెందిన నిరాదరణకు గురైన వృద్ధులను ఆశ్రమంలో చేర్చుకొని వారికి వసతి, భోజనం, వైద్య సదుపాయాలు కల్పిస్తామని రామకోటయ్య చెప్పారు. గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

టీటీడీకి రైతులు కూరగాయల వితరణ



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 18: టీటీడీ నిత్యాన్నదాన ట్రస్ట్‌కు నూజివీడు రైతులు కూరగాయల వితరణ చేశారు. నూజివీడు పట్టణ, మండల పరిధిలోని పలు వురు రైతులు వేంకటేశ్వర స్వామి భక్త సమాజం ఆధ్వర్యంలో అరటి, సొర, వంగ తదితర కూరగాయలు సుమారు 12 టన్నులు అందించారు.

ముగిసిన శ్యామలా నవరాత్రులు



హోమాలు చేస్తున్న ఆలయ చైర్మన్లు, భక్తులు

కైకలూరు, ఫిబ్రవరి 18: శ్యామలా నవరాత్రుల సందర్భంగా చివరి రోజు శ్రీశ్యామలాంబ రాజశ్యామలగా దర్శనమిచ్చారు. ఆదివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి హోమాలు నిర్వహించగా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పాల్గొన్నారు. 9 రోజుల పాటు అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమివ్వగా ఉభయదాతలు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆలయంలోని రామలింగేశ్వర, రామేశ్వరస్వామివార్ల కల్యాణ పీఠాలను సుందరంగా తీర్చి దిద్ది లఘు సంప్రోక్షణ గావించారు. ఆలయ చైర్మన్లు గుర్రం రాంబాబు, బూరుబోయిన మోహనరావు పూజలు నిర్వహించారు. ఎంపీపీ అడవి కృష్ణ, వేంకటేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్ బొప్పన శివకుమార్, ధర్మకర్తలు వసుంధర మురళీ తదితరులు పాల్గొన్నారు. ఈవో వీఎస్‌కె శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు.

నేడు లక్ష్మీనరసింహ స్వామి తిరుకల్యాణం

ముసునూరు, ఫిబ్రవరి 18: ముసునూరులోని లక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణాన్ని సోమవారం రాత్రి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. రాత్రి 7 గంటలకు ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన జరుగుతుందని భక్తులు వేలాదిగా పాల్గొని స్వామివారి కల్యాణం తిలకించి, అన్నప్రసాదాన్ని స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

నేడు పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ముసునూరు, ఫిబ్రవరి 18: ముసునూరు శివారు హనుమాన్ నగర్‌లో వేదాంతం వెంకట అనంత రామ శాస్త్రాచార్యుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో కార్యసిద్ధి శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠను సోమవారం ఉదయం 10.31నిమిషాలకు జరుగుతుందని నిర్వాహకులు వేదాంతం సత్యనారాయణమూర్తి తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో అన్నదానం జరుగుతుందని భక్తులు వేలాది పాల్గొనాలని ఆయన కోరారు.

21న బలివేలో వేలం, హుండీల లెక్కింపు

ముసునూరు, ఫిబ్రవరి 18: బలివే రామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాల్లో కొబ్బరి చెక్కలను పోగు చేసుకునే హక్కునకు ఈ 21వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. అదేరోజు దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఆలయ ధర్మకర్తల మండలి, భక్తుల సమక్షంలో స్వామివారి హుండీల లెక్కింపు జరుగుతుందని ఈవో తెలిపారు.



చాట్రాయిలో కల్లంపై ఎండబెట్టిన మొక్కజొన్న కండెలు

ముందస్తు లాభం

- నెల రోజుల ముందుగానే ఖరీఫ్, రబీకి సమాయత్తం
- ప్రస్తుతం చేతికందిన మొక్కజొన్న పంట
- గిట్టుబాటు ధర లభిస్తోందంటున్న అన్నదాత
- ఆదర్శంగా చాట్రాయి రైతాంగం

చాట్రాయి, ఫిబ్రవరి 18: చాట్రాయిలో రైతులు ఖరీఫ్, రబీ పంటలను నెల ముందు పండించి లాభాలు పొందుతుండటం విశేషం. ప్రస్తుతం ఇక్కడ రబీ మొక్కజొన్న కోతలు ముమ్మరం జరుగుతుండగా, క్వింటాల్ మొక్కజొన్న రూ. 2300కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. మిగతా గ్రామాల్లో 20 నుంచి 30 రోజులకు మొక్కజొన్న కోతలు మొదలవుతాయి. పంట ముందుగా రైతు చేతికి రావటంతో వ్యాపారులు అధిక ధరలకు కొనుగోళ్ళు చేస్తుండటంతో రైతులకు లాభాలు వస్తున్నాయి. ఉచిత విద్యుత్ పథకం అమలులోకి వచ్చాక వరిసాగు భూముల్లో కూడా రైతులు బోరుబావులు తవ్వించుకొని మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. తొలకరి మొదలు కాగానే వర్షాలు పెద్దగా కురవకపోయినా ఇక్కడి రైతులు బోర్ల కింద వరినార్లు పోసి నెల ముందుగా నాట్లు వేస్తున్నారు. దీనితో వరి పంట ముందుగా వస్తున్నది. మిషన్లతో వరికోత కోసి పచ్చి ధాన్యం 75 కేజీల బస్తా రూ. 1500కు విక్రయిస్తున్నారు. ఉప్పుడు బియ్యం మిల్లుకు వ్యాపారులు పచ్చి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. పచ్చి ధాన్యం బస్తా రూ. 1500కు అమ్మితే రూ. 1800 గిట్టుబాటు అయినట్టేనని రైతులు అం టున్నారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఎండబెట్టి తీసుకువెళ్ళినా కటింగ్‌లు పోను 75 కేజీల బస్తాకు రూ. 1200-1300 చేతికి వస్తున్నదని పచ్చి ధాన్యం అమ్ముకోవటమే లాభమని రైతులు అంటున్నారు. మార్కెటింగ్ మెలకువలు పసిగట్టి ముందుగా పంటలు పండిస్తూ లాభాలు గడిస్తున్న చాట్రాయి రైతులు ఆదర్శంగా నిలుస్తున్నారు.